తెలంగాణ పేపర్

తెలుగు దినపత్రిక

తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై ఈసీ కీలక ప్రకటన

హైదరాబాద్: తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై కేంద్ర ఎన్నికల సంఘం కీలక వివరాలను వెల్లడించింది. ఇప్పటివరకు 78.30 శాతం ఫారాల డిజిటైజేషన్ పూర్తయినట్లు తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా 2.64 కోట్లకుపైగా ఫారాలను డిజిటైజ్ చేసినట్లు పేర్కొంది.తెలంగాణలో మొత్తం 3.38 కోట్ల మంది ఓటర్లు ఉన్నట్లు ఈసీ వెల్లడించింది. వీరిలో 45.18 లక్షల మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలిపోయినట్లు, 11.25 లక్షల మంది గైర్హాజరైనట్లు గుర్తించినట్లు తెలిపింది. అలాగే 9.22 లక్షల మంది మరణించినవారిగా గుర్తించారు.మరోవైపు 73.39 లక్షల ఫారాలను సేకరించలేని వాటిగా గుర్తించినట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా ఓటర్ల వివరాల పరిశీలన, ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపింది.

హైదరాబాద్ సంపుటి: 13 సంచిక : 263 | సంపాదకులు : నస్రీన్ ఖాన్ | బుధవారం, ఆగస్టు 12, 2026 | పేజీలు : 8 వెల : రూ. 2/-

తక్షణమే రిజర్వాయర్లకు 30టి ఎంసి ల నీటిని ఎత్తిపోయాలి:

మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు



సిద్దిపేట : రైతు లు నీటిని ఎత్తి పోస్తారని ఎదురు చూస్తున్నారు రిజర్వాయర్ల దుస్థితి చూస్తే మాత్రం దుఃఖం వస్తోందని ఆవేదన వ్యక్తం చేసిన హరీష్ రావు. జిల్లా లో వచ్చే ఏడాది జులై నాటికీ సాగు, త్రాగు నీటి కొరత లేకుండా చూడాలిరైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ఇరిగేషన్, వ్యవసాయ అధికారులు సమన్వయంతో పని చేయాలిజిల్లా కలెక్టర్ కి, ఇరిగేషన్ అడ్వైజరి కమిటీ కి లేఖ వ్రాసిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు. జిల్లాలోని రిజర్వాయర్లలో తక్షణమే 30 టీఎంసీల నీటిని ఎత్తిపోయడం మరియు వచ్చే వానాకాలం వరకు జిల్లా రైతులకు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మళ్లీ వేసవిలో నీటిని ఎత్తిపోయడానికి మిడ్ మానేరులో సరిపడా నీళ్లను నిల్వ చేసేలా చర్యలు చేపట్టాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు జిల్లా కలెక్టర్ కి, ఇరిగిషన్ అడ్వైజరి కమిటీకి లేఖ వ్రాసారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా ఇరిగేషన్ అడ్వైజరీ కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగే సమావేశం సందర్భంగా జిల్లా కలెక్టర్ కి హరీష్ రావు లేఖ వ్రాసి పలు అంశాలు కమిటీ దృష్టి కి తెచ్చారు.ఎల్లినో ప్రభావంతో జిల్లా స్థాయిలో ఇరిగేషన్ కమిటీ సమావేశాన్ని నిర్వహిసున్న నేపథ్యంలో మీ దృష్టికి కొన్ని అంశాలు తెస్తున్నానని లేఖలో పేర్కొన్నారు. ఈ అంశాలపై తక్షణమే చర్యలు చేపడితే వచ్చే వానాకాలం వరకు ఎల్లినో ప్రభావాన్ని అధిగమించగలరని లేఖ ద్వారా కోరారు. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా సిద్దిపేట జిల్లాలో అన్నపూర్ణ, రం గనాయకసాగర్, కొమురవెల్లి మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్లను నిర్మిం చుకున్నాము. ప్రతీఏటా ఈ సమయం వరకే రిజర్వాయర్లలోకి రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మిడ్ మానేరు రిజర్వాయర్ నుండి నీటిని ఎత్తిపోయడం జరిగేది. కానీ ఈసారి ఇంకా ఎత్తి పోతలు ప్రారంభించలేదన్నారు. అన్నపూర్ణ, రంగనాయకసాగర్ రిజర్వాయర్లు ప్రస్తుతం డెడ్జోరేజీలో ఉన్నాయి. వీటిని వెంటనే నింపాల్సి ఉంది. అదే విధంగా కొమురవెల్లి మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్లు అడుగంటే పరిస్థితిలో ఉన్నాయన్నారు.ఈ రిజర్వాయర్లలోకి తక్షణమే 30 టీఎంసీల నీటిని ఎత్తిపోసి చెరువులు,కుంటలు మరియు చెక్ డ్యాంలు నింపి పెట్టాలని కోరుచున్నాను. దీని వల్ల భూగర్భజలాలు పెరిగి ఈ వానాకాలం పంటల సీజన్లో జిల్లాలోని రైతులకు ప్రయోజనంగా ఉంటుందని చెప్పారు.

పత్తి కొనుగోళ్లలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు: మంత్రి తుమ్మల



హైదరాబాద్, ఆగస్టు 11 : పత్తి కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఎంఎస్పీ కంటే తక్కువ ధరకు పత్తి అమ్మే పరిస్థితి రాకూడదని పేర్కొన్నారు. 2026-27 సీజన్లో 46.33 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నట్లు అంచనా వేశామని తెలిపారు. సీసీఐ అధికారులతో పత్తి కొనుగోళ్లపై మంత్రి తుమ్మల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. 25.85 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తిని అంచనా వేస్తున్నామని చెప్పారు. లాంగ్ స్టేపుల్ కాటన్కు రూ.8,667 ఎంఎస్పీ ధర ఉందని అన్నారు. గతేడాదితో పోలిస్తే రూ.557ల ఎంఎస్పీ ధర పెరిగిందని తెలిపారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలు 122 నుంచి 131కు పెంచారని వెల్లడించారు.తెలంగాణలో 356 జిన్నింగ్ మిల్లులను నోటిఫై చేయాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. 15 నుంచి 30 రోజుల్లో అన్ని జిల్లాల్లో ఈ మిల్లులను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. రైతుల ప్రతినిధులతో జిల్లా మానిటరింగ్ కమిటీలు ఏర్పాటు చేయాలని మార్గనిర్దేశం చేశారు. మధ్యవర్తుల జోక్యానికి తావులేకుండా నేరుగా పత్తి కొనుగోళ్లు చేయాలని ఆదేశించారు. కపాస్ కిసాన్ యాప్లో స్లాట్ బుకింగ్ మరింత సరళీకరణ చేస్తున్నట్లు వివరించారు. అధిక దిగుబడి రైతులకు వెంటనే డిజిటల్ ఇస్తున్నట్లు వెల్లడించారు. జిన్నింగ్ మిల్లుల్లో నాణ్యత పరీక్ష పరికరాలు తప్పనిసరని పేర్కొన్నారు.కొనుగోలు కేంద్రాల్లో సీసీటీవీలు, బరువు యంత్రాలపై నిరంతరం పర్యవేక్షిస్తున్నామని మంత్రి తుమ్మల చెప్పారు. రద్దీ, పెండింగ్ ఉంటే వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. రైతులు ఫిర్యాదులు చేయడానికి టోల్ఫ్రీ హెల్ప్లైన్: 1800 599 5779, వాట్సాప్ చాట్బాట్: 88972 81111లో సంప్రదించాలని సూచించారు.

మెట్రో ఫేజ్-2 పనుల్లో వేగం పెంచాలి: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 11 : హైదరాబాద్ పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మెట్రో ఫేజ్-2 పనుల్లో వేగం పెంచాలని దిశానిర్దేశం చేశారు. ఎంజీబీఎస్ - చాంద్రాయణగుట్ట మెట్రో కారిడార్పై కీలక నిర్ణయాలు తీసుకున్నామని పేర్కొన్నారు. 7.5 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. మెట్రో పనులకు వీలైనంత త్వరగా టెండర్ ప్రక్రియ ప్రారంభించాలని సూచించారు. పాతబస్తీ మెట్రో పనులపై సంబంధిత అధికారులతో సీఎం లో సమీక్ష సమావేశం నిర్వహించారు.పెండింగ్ భూసేకరణ పనులు వేగంగా పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి మార్గనిర్దేశం చేశారు. మెట్రో రద్దీకి అనుగుణంగా అదనపు కోచ్‌లు కొనుగోలు చేయాలని సూచించారు. ప్రస్తుత టెక్నాలజీపై ఢిల్లీ మెట్రో సలహాలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. డిసెంబర్‌లో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత సమ్మిట్ పెట్టుబడులపై పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ నిర్వహణకు ప్లాన్ చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు. తెలంగాణలో మరిన్ని పెట్టుబడులు ఆకర్షించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. వివిధ రంగాల్లో గుర్తింపు పొందిన ప్రముఖులను సన్మానించాలని సూచించారు. గత ఏడాది పెట్టుబడులు, పురోగతిపై పూర్తి వివరాలు ఇవ్వాలని ఆదేశించారు. పెట్టుబడుల్లో మరింత పురోగతికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు.

టెసరాక్ట్ కంపెనీకి అప్పనంగా భూమి కేటాయించారు

చదువురాని రేవంత్ బ్రదర్స్ అందరూ సూట్లు కోట్లు వేసుకుని చైర్మన్లు అయిపోతున్నరు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్: పక్క రాష్ట్రం కర్ణాటకలో మాజీ సీఎం సిద్ధరామయ్య సతీమణికి.. అక్కడి ప్రభుత్వం మూడెకరాల భూమి కేటాయించిందని బీజేపీ ఫిర్యాదు చేసింది. ఆ వ్యవహారంలో లోకాయుక్త తీర్పు ఇచ్చింది. చివరికి సిద్ధరామయ్య రాజీనామా చేసేదాకా వచ్చిందని బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు.

తెలంగాణలో టెసరాక్ట్ అనే కంపెనీకి అప్పనంగా భూమి కేటాయించారు. టెసరాక్ట్ కంపెనీకి రేవంత్ సోదరుడు కొండల్ రెడ్డి చైర్మన్. ఆ విషయాన్ని కొండల్ రెడ్డే లింక్డ్ ఇన్ ప్రొఫైల్లో పెట్టుకున్నారు. టెసరాక్ట్ కంపెనీ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ పరికరాలను తయారు చేస్తుందట. అమెరికా ఎంబసీ ప్రతినిధితో హైదరాబాద్లో మీటింగ్ కూడా పెట్టారు. యూఎస్ ఇండియా స్ట్రాటెజిక్ డెవలప్ మెంట్ ఫోరంలో.. ఎగ్జిక్యూటివ్ బోర్డులో కొండల్ రెడ్డికి సభ్యత్వం ఇచ్చారని అన్నారు.

కొండల్ రెడ్డి ఏం చదివారో నాకు తెలియదు. టెసరాక్ట్ కంపెనీకి కొండల్ రెడ్డి చైర్మన్ అని అమెరికా కాన్సులేట్ కూడా స్టేట్ మెంట్ ఇచ్చింది.చదువురాని రేవంత్ బ్రదర్స్ అందరూ సూట్లు కోట్లు వేసుకుని చైర్మన్లు అయిపోతున్నరు. టెసరాక్ట్ కంపెనీ కథ ఏంటని మేం ఆరా తీశాం. ఆ కంపెనీ ఫోన్ నంబర్ 123456789 అట. ఇలాంటి నంబర్లు ఉంటాయని మాకు తెల్వదు. రేవంత్ ఏదైనా కొత్త టెక్నాలజీ కనిపెట్టిండేమో? విచిత్రం ఏంటంటే టెసరాక్ట్ కంపెనీలో ఒక్క ఉద్యోగి కూడా లేదు. 2025 మార్చి 31 నాడు వాళ్లే ప్రకటన చేశారు. తమ కంపెనీలో ఒక్క ఉద్యోగి కూడా లేడని చెప్పారు. ఊరూ పేరు లేని చోట ఆ కంపెనీ అడ్రస్ ఉంది. టెసరాక్ట్ మూలధనం లక్ష రూపాయలు. ఈ కంపెనీకి రేవంత్ ప్రభుత్వం రూ.200 కోట్ల విలువైన భూమి కట్టబెట్టింది. ఈ కంపెనీకి రేవంత్ ప్రభుత్వం రూ.200 కోట్ల విలువైన భూమి కేటాయించి, అతిపెద్ద కుంభకోణానికి పాల్పడ్డారు. ఇది అనుముల కొండల్ రెడ్డి వ్యవహారం. అనుముల జగదీష్ రెడ్డి అని రేవంత్కు ఇంకో తమ్ముడు ఉన్నాడు. జగదీష్ రెడ్డి అమెరికాలో ఉంటాడు. రేవంత్ అమెరికా పర్యటనకు పోయినప్పుడు.. వెయ్యి కోట్ల డీల్ చేసుకున్నరు. స్వచ్ బయో అనే కంపెనీతో ఒక మెమోరాండం సైన్ చేశారు. వాళ్లకు ఎక్కడ భూములు ఇచ్చారో తవ్వి తీస్తామని అన్నారు.

రేవంత్ బామ్మర్ది సృజన్ రెడ్డికి రూ.1,137 కోట్ల అమృత్ కాంట్రాక్టు దక్కింది. రేవంత్ రెడ్డి, మోడీ ప్రభుత్వం కలిసి నడుపుతున్న సింగరేణిలో.. సృజన్ రెడ్డి కనుసన్నల్లోనే అంతా నడుస్తోంది. సైట్ విజిటేషన్ సర్టిఫికెట్లు, వేల కోట్ల కుంభకోణాలు అన్నీ బయటపెట్టినం. ఈ పరంపరలో మేం బయటపెట్టిన తాజా కుంభకోణమే టెసరాక్ట్. వడ్డించే వాడే మనోడే అన్నట్టు భూములు కొట్టేశారు. రూ.200 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని రూ.7 కోట్లకు రాసిచ్చారు. ఇది స్కాం కాదా? పక్క రాష్ట్రం కర్ణాటకలో ఒక న్యాయం, ఇక్కడ ఒక న్యాయమా? టెసరాక్ట్ కథేంటో తేల్చేదాకా వదిలిపెట్టం. ఆ కంపెనీకి, ముఖ్యమంత్రి సోదరుడికి ఏ సంబంధం లేదని శ్రీధర్ బాబు అంటున్నడు. చైర్మన్ అనుముల కొండల్ రెడ్డి అని వాళ్లే ప్రొఫైల్లో రాసుకున్నరు. కానీ మంత్రి శ్రీధర్ బాబు సిగ్గులేకుండా బుకాయిస్తున్నరు. అసలు ఇవన్నీ మంత్రికి తెలిసి జరుగుతున్నాయా? మీ శాఖలో ఏం జరుగుతుందో మీకు తెలుస్తుందా శ్రీధర్ బాబు గారు? ఈ భూకేటాయింపుల కుంభకోణంలో ఎవరినీ వదిలిపెట్టం. ముఖ్యమంత్రి సోదరులైతే ఏమైనా చేయొచ్చా? సీఎం అన్న తిరుపతి రెడ్డికి ఏ అధికారిక హోదా ఉంది? కలెక్టర్లు, ఎస్పీలు ఆయనకు వంగివంగి దండాలు పెడుతున్నరని అన్నారు.

అమిత్ షా సభకు రావాలి..

విపక్షాల నినాదాలు..



పార్లమెంట్ వర్షాకాల సమావేశాల చివరి దశలో అధికార, విపక్షాల మధ్య ప్రతిష్ఠంభన కొనసాగుతోంది. మంగళవారం పార్లమెంట్ ద్వారం వద్ద విపక్ష ఎంపీలు నిరసనలు చేపట్టారు. ఢిల్లీలో విద్యార్థుల నిరసనలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభకు వచ్చి సమాధానం చెప్పాలంటూ విపక్ష ఎంపీలు నినాదాలు చేశారు. విద్యార్థుల ఆందోళనపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సోమవారం హామీ ఇచ్చారువిద్యార్థుల ఆందోళనపై జరిగే చర్చకు హోం మంత్రి అమిత్ షా సమాధానమిస్తారని, అయితే ప్రతిపక్షాలు ప్రభుత్వ సమాధానాన్ని శాంతియుతంగా వినవలసి ఉంటుందని రిజిజు అన్నారు. కాగా, జార్ఖండ్లో ఉద్యోగార్థులపై పోలీసుల చర్య, అయోధ్య రామమందిర విరాళాల అపహరణకు నిరసనగా అధికార, విపక్ష ఎంపీలు నిరసనలు చేపట్టారు. మంగళవారం పార్లమెంట్ ప్రధాన ద్వారం వద్ద ఎన్డీయే, విపక్ష ఎంపీలు పోటాపోటీగా నినాదాలు చేశారుజార్ఖండ్లో విద్యార్థుల నిరసనలపై చర్చ నుంచి కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ పారిపోతున్నారని ఎన్డీయే ఎంపీలు ఆరోపించారు ఢిల్లీలో జులై 20న జరిగిన నిరసనలపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా జవాబుదారీతనం వహించాలని విపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు. కాగా, విపక్షాల ఆందోళనల నేపథ్యంలో సభను బుధవారానికి వాయిదా వేశారు.

కేరళ పేరును కేరళంగా మార్చే బిల్లుకు లోక్‌సభ ఆమోదం..



న్యూఢిల్లీ: కేరళ రాష్ట్రం పేరును కేరళంగా మార్చేందుకు ఉద్దేశించిన బిల్లుకు లోక్‌సభ ఇవాళ (మంగళవారం) ఆమోదం తెలిపింది. విపక్ష సభ్యుల ఆందోళనల మధ్యే బిల్లును సభలో ప్రవేశపెట్టి మూజువాణి ఓటుతో ఆమోదించారు. రాష్ట్రం పేరును కేరళంగా మార్చాలని కోరుతూ కేరళ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును తీసుకొచ్చింది. అయితే, బిల్లుపై చర్చ జరుగుతున్న సమయంలో విపక్ష సభ్యులు సభలో ఆందోళనకు దిగారు. దీంతో గందరగోళ పరిస్థితి నెలకొంది.అయినప్పటికీ బిల్లుపై ప్రక్రియను కొనసాగించిన సభ.. చివరకు మూజువాణి ఓటుతో ఆమోదించింది. తదుపరి ప్రక్రియలో భాగంగా బిల్లును రాజ్యసభకు పంపనున్నారు. రాష్ట్ర అధికారిక పేరును మలయాళంలో 'కేరళం'గా ఉపయోగిస్తున్న నేపథ్యంలో అదే పేరును రాజ్యాంగపరంగానూ అమలు చేయాలన్న డిమాండ్ చాలాకాలంగా ఉంది. ఈ నేపథ్యంలో కేంద్రం తీసుకొచ్చిన సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం లభించింది. కాగా, ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై పోలీస్ చర్యలకు గాను పార్లమెంట్లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు ఆందోళనకు దిగాయి.

సభను సజావుగా సాగనివ్వండి: ఓం బిర్లా

ఢిల్లీ: ఇవాళ పార్లమెంటు సమావేశాలు ప్రారంభమయ్యాయి. మొదలైన కాసేపటికే హోంమంత్రి అమిత్ షా సభకు రావాలంటూ విపక్షాల నినాదాలు చేశారు. లోక్ సభలో మళ్లీ గందరగోళం నెలకొన్నందున వాయిదా పడింది. పార్లమెంట్ మకరద్వారం వద్ద ఎన్ డిఏ ఎంపిల ఆందోళన చేశారు. విపక్షాలు పదేపదే సభను అడ్డుకోవడం సరికాదని, సభను సజావుగా సాగనివ్వండని స్పీకర్ ఓం బిర్లా కోరారు.



తెలంగాణ పవర్

సంపాదకీయం

బుధవారం, ఆగస్టు 12, 2026


ఖరీఫ్ కోలుకుంది... మరి రబీ

ఎల్‌నినో బలపడుతోంది.. జూన్‌లో వర్షాలు దారుణంగా పడిపోయాయి.. ఖరీఫ్ సాగు గతేడాదితో పోలిస్తే భారీగా వెనుకబడింది. దీంతో ఈ ఏడాది పంటల దిగుబడిపై ఆందోళన మొదలైంది. కానీ జూలైలో పరిస్థితి అనూహ్యంగా మారిపోయింది. నైరుతి రుతువవనాలు ఒక్కసారిగా పుంజుకోవడంతో వర్షాలు ఊపందుకున్నాయి. ఫలితంగా ఖరీఫ్ సాగు లోటు బాగా తగ్గింది.. ముఖ్యంగా రబీ పంటలపై ఎల్‌నినో ప్రభావం ఉండే అవకాశం ఆందోళన కలిగిస్తోంది.ఈ ఏడాది నైరుతి రుతుపవనాల ప్రారంభం వ్యవసాయ రంగానికి నిరాశ కలిగించింది. ఎల్‌నినో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలను మాత్రమే మార్చదు. వాతావరణంలోని గాలి, పీడన వ్యవస్థలపై కూడా ప్రభావం చూపుతుంది. అయితే ఈ ప్రభావం వెంటనే కనిపించదు. సాధారణంగా ఒకటి నుంచి రెండు నెలల ఆలస్యం ఉండొచ్చు. అందువల్ల జూలైలో వర్షాలు బాగా పడ్డాయని ఎల్‌నినో ప్రభావం ముగిసిపోయిందని భావించడం తప్పు. రుతుపవనాలపై దాని ప్రతికూల ప్రభావం ముందుముందు కనిపించే అవకాశం ఉంది.ఎల్‌నినో బలపడితే ఉష్ణోగ్రతలు కూడా పెరిగే అవకాశం ఉంటుంది. అదే జరిగితే రబీ సీజన్ పంటలపై ప్రభావం పడొచ్చు. ముఖ్యంగా గోధుమ, ఆవాలు, బంగాళాదుంప వంటి పంటలకు తక్కువ వ్యవధి ఉండే వేడి శీతాకాలం అనుకూలం కాదు. అంటే ఈ ఏడాది ఖరీఫ్ పంటలు అనుకున్నంత దెబ్బతినకపోయినా.. రబీ సీజన్‌లో అసలు సవాలు ఎదురయ్యే అవకాశం ఉంది.వ్యవసాయానికి వాతావరణ ముప్పుతో పాటు ప్రపంచ మార్కెట్లలో ఆహార ధరల పరిస్థితి కూడా భారత్‌కు సవాలుగా మారుతోంది. ఐక్యరాజ్యసమితి ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ) ఆహార ధరల సూచీ జూలైలో 131.1 పాయింట్లకు చేరింది. ఇది జూన్‌తో పోలిస్తే పెరుగుదల మాత్రమే కాదు.. మూడున్నరేళ్ల గరిష్ఠ స్థాయికి చేరిన సూచీ. అయితే ఈ పెరుగుదలలో ప్రధాన పాత్ర పోషించింది వంటనూనెల ధరలు. జూలైలో ఎఫ్ఏఓ వెజిటబుల్ ఆయిల్స్ ఇండెక్స్ ఏడాది ప్రాతిపదికన 17.3 శాతం పెరిగింది. 2022 జూన్ తర్వాత ఇదే అత్యధిక స్థాయి.అంతర్జాతీయంగా పెట్రోలియం ధరలు పెరిగితే.. పామాయిల్, రేప్‌సీడ్ ఆయిల్, సోయాబీన్ ఆయిల్ వంటి వంటనూనెలను బయోఫ్యూయల్ తయారీలో ఉపయోగించేందుకు ప్రోత్సాహం పెరుగుతుంది. దీంతో ఆహార అవసరాలకు అందుబాటులో ఉండే నూనెలపై ఒత్తిడి పెరిగి ధరలు మరింత పెరిగే అవకాశం ఉంటుంది.జూన్‌లో దేశవ్యాప్తంగా సాధారణ దీర్ఘకాల సగటు వర్షపాతం (ఎల్‌పీఏ) కంటే 38 శాతం తక్కువ వర్షాలు నమోదయ్యాయి. సాధారణంగా జూన్‌లో సుమారు మూడు అల్పపీడన వ్యవస్థలు ఏర్పడి వర్షాలను తీసుకొస్తాయి. అవి సగటున 11 రోజుల పాటు ప్రభావం చూపుతాయి. కానీ ఈ ఏడాది జూన్‌లో ఒక్క అల్పపీడన వ్యవస్థ కూడా ఏర్పడలేదు. దీంతో 1901 తర్వాత దేశంలో అత్యంత తక్కువ వర్షపాతం నమోదైన జూన్ నెలల్లో ఇది ఆరో స్థానంలో నిలిచింది. ఇంతటి లోటు వర్షపాతం నమోదైన సమయంలో ఎల్‌నినో ఇంకా బలహీన-మోస్తరు దశలోనే ఉండటం గమనార్హం.వర్షాలు ఆలస్యం కావడంతో పంటల సాగు కూడా మందగించింది. జూలై 6 నాటికి దేశంలో ఖరీఫ్ పంటలు కేవలం 350.85 లక్షల హెక్టార్లలో మాత్రమే సాగయ్యాయి. గత ఏడాది ఇదే సమయానికి 442.80 లక్షల హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. అంటే సాగు విస్తీర్ణం గతేడాదితో పోలిస్తే 20.8 శాతం తక్కువగా ఉంది. నూనెగింజల విషయంలో లోటు మరింత ఎక్కువగా ఉండగా.. పప్పుధాన్యాల్లో 21.8 శాతం, పత్తిలో 23 శాతం వరకు సాగు తగ్గింది. నూనెగింజలు, పప్పుధాన్యాలు, పత్తి వంటి పంటల విషయంలో సాగు తగ్గితే దేశీయ ఉత్పత్తిపై ప్రభావం పడటంతో పాటు దిగుమతులపై ఆధారపడాల్సిన పరిస్థితి పెరుగుతుంది.ఎల్‌నినో జూలైలో బలహీన-మోస్తరు స్థాయి నుంచి మోస్తరు-బలమైన స్థాయికి చేరినా.. నైరుతి రుతుపవనాలు మాత్రం బలంగా పుంజుకున్నాయి. జూలైలో సాధారణంగా మూడు అల్పపీడన వ్యవస్థలు ఏర్పడాల్సి ఉండగా.. ఈసారి నాలుగు అల్పపీడన వ్యవస్థలు ఏర్పడ్డాయి. అంతేకాదు.. ఇవి నెమ్మదిగా కదలడంతో ఎక్కువ కాలం వర్షాలను కురిపించాయి. సాధారణంగా అల్పపీడన వ్యవస్థల ప్రభావం సుమారు 14 రోజులు ఉండగా.. జూలైలో ఇది దాదాపు 24 రోజులకు చేరింది. దీంతో జూలైలో దేశవ్యాప్తంగా వర్షపాతం సాధారణం కంటే 2.4 శాతం ఎక్కువగా నమోదైంది. ఇది భారత వాతావరణ విభాగం అంచనాలకు కూడా భిన్నంగా ఉండటం విశేషం. జూలైలో వర్షాలు సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. కానీ వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా మారింది.జూలై చివరి నాటికి దేశంలో ఖరీఫ్ పంటల సాగు విస్తీర్ణం 894.22 లక్షల హెక్టార్లకు చేరింది. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే ఇప్పుడు సాగు విస్తీర్ణం కేవలం 2.9 శాతం మాత్రమే తక్కువగా ఉంది. అంటే జూన్‌లో 20.8 శాతంగా ఉన్న సాగు లోటు.. జూలై చివరికి కేవలం 2.9 శాతానికి తగ్గిపోయింది. పప్పుధాన్యాల్లో సాగు లోటు 6.3 శాతానికి, పత్తిలో 2.4 శాతానికి తగ్గింది. నూనెగింజల సాగు మాత్రం గతేడాది స్థాయిని కూడా అధిగమించింది. ముఖ్యంగా వేరుశనగ, నువ్వుల సాగు మెరుగుపడింది.జూలై మూడో, నాలుగో వారాల్లో కురిసిన వర్షాలు ఇప్పటికే విత్తిన పంటలకు కూడా ఊపిరి పోశాయని మహారాష్ట్రలోని లాతూర్‌కు చెందిన ప్రముఖ పప్పుల మిల్లర్ నితిన్ కలంత్రికి తెలిపారు. వర్షాల లోటుతో తేమ ఒత్తిడిని ఎదుర్కొంటున్న పంటలకు ఈ వర్షాలు ఎంతో ఉపశమనం కలిగించాయని ఆయన పేర్కొన్నారు. ఈ వర్షాలు లేకపోతే మొక్కల్లో వేర్లు, కాండం, ఆకుల పెరుగుదల వంటి వృక్ష దశ అభివృద్ధి దెబ్బతినేదని వివరించారు.సోయాబీన్ పంట పరిస్థితి కూడా మెరుగుపడింది.ఖరీఫ్ పంటలకు ఆగస్టు, సెప్టెంబర్ తొలి వారాల్లో కూడా వర్షాలు అవసరం. ఈ దశలో పంటలు పూత దశకు, గింజలు లేదా కాయలు ఏర్పడే దశకు చేరుకుంటాయి.

- ఎడిటర్

ఏషియన్ పెయింట్స్ 'బ్యూటిఫుల్ హోమ్స్ పెయింటింగ్ సర్వీస్' క్యాంపెయిన్ - ఇంటికి రంగులు వేయడం ఇక అత్యంత సులభం

తిరుపతి , ఆగస్టు , 2026: ఇంటికి రంగులు వేయడం చాలా ఒత్తిడితో కూడుకున్న పని. ఎందుకంటే, కాంట్రాక్టర్ ను సమన్వయం చేసుకోవడం, సరైన రంగులను ఎంచుకోవడం, సమయపాలన పాటించడం, పరిశుభ్రత, వాటర్‌ప్రూఫింగ్ సమస్యలను పరిష్కరించుకోవడం వీటితో పాటు నాణ్యత తదితర అంశాలు ఇమిడి ఉంటాయి. ఈ ప్రధాన అంశాలను గుర్తించిన ఏషియన్ పెయింట్స్ 'ఏషియన్ పెయింట్స్ బ్యూటిఫుల్ హోమ్స్ పెయింటింగ్ సర్వీస్' క్యాంపెయిన్ ను దక్షిణాది వినియోగదారుల కోసం ప్రారంభించింది. సైట్ ఇన్‌స్పెక్షన్, ప్రత్యేక సూపర్‌విజన్, ఏఐ విజువలైజర్ ద్వారా వ్యక్తిగత కలర్ కన్సల్టేషన్, ఇరవై శాతం మనీ బ్యాక్ గ్యారెంటీ, ప్రొడక్ట్ స్కాన్ ఆధారిత వారంటీ, సరైన సమయానికి పని పూర్తి చేయడం వంటి ప్రత్యేకతలతో ఈ సేవ వినియోగదారులకు అందుబాటులోకి వస్తుంది. ఈ క్యాంపెయిన్‌లో దక్షిణ భారతదేశ సంస్కృతి, గృహ యజమానుల రోజువారీ అనుభవాల ఆధారంగా రూపొందించిన వరుస ప్రకటన చిత్రాలు ఉన్నాయి. 'ఆనందకరమైన ఆశ్చర్యం' అనే అంశం నేపథ్యంగా సాగే ఈ చిత్రాలలో ఒక పెయింటింగ్ ప్రాజెక్ట్ ఇంత సులభంగా, అవాంతరాలు లేకుండా ఎలా పూర్తవుతుందో నమ్మలేకపోయే ఒక అనుమానాస్పద తండ్రి కనిపిస్తారు. ఆయనకు తన కుమారుడు 'బ్యూటిఫుల్ హోమ్స్ పెయింటింగ్ సర్వీస్' అందించే సులువైన, శ్రమలేని అనుభవాన్ని పరిచయం చేస్తారు. ప్రతీ ఇంట్లో జరిగే ఆత్మీయ కుటుంబ సన్నివేశాల ద్వారా ఈ చిత్రాలు ఏషియన్ పెయింట్స్ బ్యూటిఫుల్ హోమ్స్ పెయింటింగ్ సర్వీస్ ముఖ్యమైన సేవలను ప్రముఖంగా చూపిస్తాయి. వాటిలో ప్రత్యేక సూపర్‌విజన్, ఏఐ విజువలైజర్ ద్వారా కలర్ కన్సల్టేషన్, ఇరవై శాతం మనీ బ్యాక్ గ్యారెంటీ,



ప్రొడక్ట్ స్కాన్ ఆధారిత వారంటీ, సరైన సమయానికి పని పూర్తి చేయడం వంటివి ఉన్నాయి. పెయింటింగ్ ప్రక్రియలోని ప్రతి దశను ఏషియన్ పెయింట్స్ నిపుణులు ఎంత నైపుణ్యంతో నిర్వహిస్తారో ఇవి స్పష్టంగా తెలియజేస్తాయి. పెయింట్స్, హోమ్ డెకోర్ రంగంలో దశాబ్దాల నాయకత్వంతో ఏషియన్ పెయింట్స్ బ్యూటిఫుల్ హోమ్స్ పెయింటింగ్ సర్వీస్ తమ నమ్మకమైన ఉత్పత్తులు, శిక్షణ పొందిన నిపుణులు, సాంకేతిక పరిష్కారాలను అనుసంధానిస్తూ దేశవ్యాప్తంగా ఉన్న గృహ యజమానులకు ఎటువంటి ఇబ్బందులు లేని, ప్రొఫెషనల్ పెయింటింగ్ అనుభవాన్ని అందిస్తోంది.

ఈ సందర్భంగా ఏషియన్ పెయింట్స్ ఎండీ, సీఈఓ అమిత్ సింగిల్ మాట్లాడుతూ ఇంటిని అందంగా తీర్చిదిద్దుకోవడం అనేది ప్రతీ ఒక్కరికీ ఎంతో ప్రత్యేకమైన భావోద్వేగంతో కూడుకున్న విషయం అన్నారు. అయితే, నాణ్యత, పనుల నిర్వహణ, సమయపాలన, సుదీర్ఘకాల రక్షణకు సంబంధించిన ఆందోళనల వల్ల ఇది తరచుగా తీవ్రమైన ఒత్తిడికి గురి చేస్తుందన్నారు. అందుకే, 'బ్యూటిఫుల్ హోమ్స్ పెయింటింగ్ సర్వీస్' ద్వారా మేము ప్రొఫెషనల్ నైపుణ్యం, అత్యుత్తమ సేవా ప్రమాణాలు, సమయానికి పనులు పూర్తి చేయడం, నమ్మకమైన వారంటీలను ఒకే చోటికి చేర్చి పెయింటింగ్, వాటర్‌ప్రూఫింగ్ పరిష్కారాన్ని అందించే వ్యవస్థను రూపొందించామని పేర్కొన్నారు. ఏఐ కలర్ విజువలైజేషన్‌ను మా సర్వీస్ అత్యుత్తమ పని తనంతో అనుసంధానించడం ద్వారా, గృహ యజమానులకు గదుల రూపురేఖలు మార్చే ప్రక్రియను ఎంతో సులభమైన, కచ్చితమైన అనుభవంగా మారుస్తున్నామన్నారు. ఇంటి మార్పు ప్రక్రియను మరింత సరళంగా, అంచనాలకు తగినట్లు, ఆనందదాయకంగా మార్చడం మా లక్ష్యమన్నారు. దీని వల్ల గృహ యజమానులు శ్రమ లేకుండా, అంతిమంగా వచ్చే అందమైన ఫలితాన్ని మాత్రమే ఆస్వాదించగలుగుతారని పేర్కొన్నారు.

అవంచ పీహెచ్‌సీలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ,గర్భిణీల నెలవారి ఆరోగ్య పరిస్థితులపై ఆరా, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి తెలంగాణ పవర్ : ఆగష్టు-11: జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, నాగర్ కర్నూల్ నియోజకవర్గం, తిమ్మాజీపేట మండలంలోని అవంచ గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుతున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలు, మందుల లభ్యత తదితర అంశాలను జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రానికి ఏఎంసి వైద్య పరీక్షల కోసం వచ్చిన గర్భిణీలతో కలెక్టర్ మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను, గర్భిణీలకు నిర్వహిస్తున్న నెలవారీ ఏఎంసీ పరీక్షల వివరాలు, ఇప్పటివరకు నిర్వహించిన వైద్య పరీక్షలు, ఆరోగ్య నివేదికలు, వారికి అందుతున్న వైద్య సేవలపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

గర్భిణీల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైన వైద్య పరీక్షలు, మందులు, సూచనలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు.

లాగే చికిత్స కోసం ఆరోగ్య కేంద్రానికి వచ్చిన బాలికతో కలెక్టర్ మాట్లాడి ఆమెకు ఉన్న ఆరోగ్య సమస్యల వివరాలను బాలిక తల్లి తో అడిగి తెలుసుకున్నారు.



ఆమెకు అందిస్తున్న చికిత్స, వైద్యుల సూచనలు, అవసరమైన మందుల వివరాలపై సంబంధిత వైద్యులను ప్రశ్నించారు. రోగులకు వైద్య సేవలు అందించే విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల నుంచి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా వైద్యులు, వైద్య సిబ్బంది పనిచేయాలని కలెక్టర్ సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ వైద్య సేవలు అందుబాటులో ఉండేలా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలకు అంతరాయం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రజలు వైద్య సేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే మెరుగైన చికిత్స అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రతి రోగి పట్ల బాధ్యతగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను ఓపికగా విని అవసరమైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు.

అనంతరం ఆరోగ్య కేంద్రంలోని మందుల నిల్వలను కలెక్టర్ పరిశీలించారు. అందుబాటులో ఉన్న మందులు, వినియోగిస్తున్న మందులు, అత్యవసర మందుల నిల్వల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

మందుల కొరత ఏర్పడకుండా ముందస్తుగా అవసరాలను గుర్తించి సంబంధిత అధికారులకు నివేదించి

అవసరమైన మందులను తెప్పించుకోవాలనిసూచించారు.

అదేవిధంగా ఆరోగ్య కేంద్రంలో రోజువారీగా నిర్వహిస్తున్న ఓపీ వివరాలు, వైద్య సేవలు పొందుతున్న రోగుల సంఖ్య, అందిస్తున్న చికిత్స తదితర వివరాలపై కలెక్టర్ ఆరా తీశారు. రికార్డులను క్రమపద్ధతిలో నిర్వహించాలని, ప్రతిరోజూ అందుతున్న వైద్య సేవలకు సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేయాలని అధికారులకు సూచించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు గ్రామీణ ప్రాంత ప్రజలకు కీలకమైన వైద్య సేవల కేంద్రాలని, ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడంలో వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రతి ఒక్కరికీ అవసరమైన వైద్య సేవలు అందేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.జిల్లా కలెక్టర్ వెంట వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల గురించి సమాచారం అందించాలి

కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ లో డిఎస్పి రవీందర్ రెడ్డి

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి ఆగస్టు 11తెలంగాణ పవర్ : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం తెల్లవారుజామున మణుగూరు పట్టణంలోని శివలింగాపురం ప్రాంతంలో కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వాహనాలను తనిఖీ చేస్తూ పెండింగ్ ట్రాఫిక్ చలాన్లపై ప్రత్యేక దృష్టి సారించారు. 147 వాహనాలకు సంబంధించిన పాత పెండింగ్ చలాన్ల ద్వారా మొత్తం రూ.35 వేల రూపాయలను వసూలు చేశారు. అదేవిధంగా నిబంధనలను ఉల్లంఘించిన వారిపై 13 స్పాట్ కేసులు నమోదు చేశారు. సరైన నంబర్ ప్లేట్లు లేని 3 ద్విచక్ర వాహనాలను స్వాధీనం పరుచుకున్నారు అక్రమంగా తరలిస్తున్న/నిల్వ చేసిన రూ.35వేల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకుని, సంబంధిత వ్యక్తులపై కేసులను నమోదు చేశారు. అనంతరం శివలింగాపురం కాలనీవాసులతో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ ఏర్పాటుచేసి సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్ లు, లింక్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ, డ్రగ్స్ను దూరంగా ఉండాలని,



మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలకు సరైన నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకుని ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.నేరాల నియంత్రణలో భాగంగా కాలనీల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, కొత్త వ్యక్తులకు ఇళ్లను అద్దెకు ఇచ్చే సమయంలో వారి పూర్తి వివరాలను తెలుసుకుని, తగిన ధృవీకరణ చేసుకోవాలని ప్రజలకు సూచించారు. చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ప్రజలకు ఏవైనా సమస్యలు ఉన్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలని, ప్రజల భద్రతకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి, మణుగూరు సీఐ నాగబాబు, ఏడుల్ల బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ సిహెచ్ నగేష్, పోలీస్ టీజీఎస్ పీ సిబ్బంది పాల్గొన్నారు.

2028 గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్

హైదరాబాద్ ఆగస్టు 11, (న్యూస్ పల్స్)2028 అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో మళ్లీ అధికారంలోకి రావడమే ఏకైక లక్ష్యంగా తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సరికొత్త సంస్థాగత వ్యూహానికి తెరలేపింది. సాధారణంగా కేడర్‌కు ఇచ్చే పార్టీ పదవులను ఈసారి నేరుగా గెలిచిన ప్రజాప్రతినిధులకే కట్టబెడుతోంది. 2028 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తిరుగులేని మెజార్టీతో మళ్లీ అధికారంలోకి వస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదేపదే వ్యక్తం చేస్తున్న ధీమా వెనుక ఈ పక్కా సంస్థాగత ప్రణాళికే కారణమని తెలుస్తోంది.కాంగ్రెస్ పార్టీ సంస్థాగత ప్రక్షాళన ప్రక్రియను పార్టీ అధిష్టానం ఏడాది కిందటే ప్రారంభించింది. జనవరి 2024లో ఎమ్మెల్యే కోటా కింద ఎమ్మెల్సీగా ఎన్నికైన బి. మహేష్ కుమార్ గౌడ్‌కు సెప్టెంబర్ 2024లో టీపీసీసీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత కీలక పదవుల్లో ప్రజాప్రతినిధులకు పెద్దపీట వేశారు. టీపీసీసీ ఉపాధ్యక్షులుగా నల్గొండ ఎంపీ కె.రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, బసవరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయని రాజేందర్ రెడ్డి, సి.వంశీకృష్ణలకు కట్టబెట్టింది. అలాగే టీపీసీసీ ప్రధాన కార్యదర్శులుదా ఎమ్మెల్యేలు వేడ్మ బొజ్జు, డాక్టర్ చిట్టెం పరిణికా రెడ్డి, డాక్టర్ మట్ట రాగమయిల ను నియమించింది..పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్ష పదవులను కూడా ప్రజాప్రతినిధులకే కేటాయించారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరయ్యను టీపీసీసీ ఓబీసీ సెల్ చైర్మన్‌గా, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను ఎస్సీ సెల్ చైర్మన్‌గా, ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌ను ఎస్టీ సెల్ అధిపతిగా నియమించారు. నాగర్‌కర్నూల్ ఎంపీడాక్టర్ మల్లు రవికి టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ చైర్మన్ బాధ్యతలువహించారు. తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి నారాయణపేటఎమ్మెల్యేడాక్టర్‌చిట్టెంపరిణికా రెడ్డి పేరును పరిశీలించినప్పటికీ, వ్యక్తిగత కారణాలతో ఆమె తిరస్కరించడంతో వరంగల్ మాజీ మేయర్ ఎర్రబెల్లిపదవిలో నియమించారు.ఇటీవల భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిని టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్‌గా నియమించగా, జిల్లా స్థాయిలోనూ ఐదుగురు ఎమ్మెల్యేలను డీసీసీ అధ్యక్షులుగా నియమించారు.

రక్షణ రంగంలో 62.66 శాతం భారీ వృద్ధి

న్యూఢిల్లీ, ఆగస్టు 11, (న్యూస్ పల్స్)భారతదేశ రక్షణ రంగ ఎగుమతులు మునుపెన్నడూ లేని విధంగా సరికొత్త మైలురాయిని అధిగమించాయి. గత ఆర్థిక సంవత్సరంలో రక్షణ ఎగుమతులు ఏకంగా రూ. 38,424 కోట్లకు చేరి, మునుపటి ఏడాదితో పోలిస్తే 62.66 శాతం భారీ వృద్ధిని నమోదు చేశాయి. ఒకప్పుడు కేవలం 'బ్రహ్మోస్' సూపర్ సోనిక్ క్రూయిజ్ మిస్సైల్ మాత్రమే భారత ఎగుమతులకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండేది. కానీ మారుతున్న ఆధునిక యుద్ధ తంత్రాలకు అనుగుణంగా ప్రస్తుతం భారతదేశం డ్రోన్లు, ఖచ్చితత్వంతో దాడి చేసే గైడెడ్ క్షిపణులు, రాడార్లు మరియు అత్యాధునిక ఎలక్ట్రానిక్స్ పరికరాలను ప్రపంచ దేశాలకు సరఫరా చేస్తోంది.ప్రస్తుతం భారత్ నుండి ప్రపంచవ్యాప్తంగా 80కి పైగా దేశాలకు రక్షణ సామగ్రి ఎగుమతి అవుతుండగా, ఎగుమతిదారుల సంఖ్య కూడా 145కు పెరిగింది. ముఖ్యంగా నోయిడాకు చెందిన ఐజీ డిఫెన్స్ అభివృద్ధి చేసిన 'కాల్' అనే సుదూర లక్ష్యాలను ఛేదించే అటాక్ డ్రోన్ అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దాదాపు 1000 కిలోమీటర్ల దూరం ప్రయాణించి, 50 కేజీల బరువును మోసుకెళ్లగల ఈ స్వదేశీ డ్రోన్ టెక్నాలజీ.. ఖరీదైన మిస్సైళ్లతో పనిలేకుండా శత్రు స్థావరాలను అత్యంత తక్కువ ఖర్చుతో అణచివేయగల సామర్థ్యాన్ని కలిగి ఉంది.మరోవైపు, ఆయుధాల తయారీతో పాటు వాటి లోపల ఉండే "మేధో పొర" అనగా ఎలక్ట్రానిక్ ఫ్యూజ్ మరియు గైడెన్స్ సిస్టమ్స్ విభాగంలో కూడా భారత్ అగ్రగామిగా ఎదుగుతోంది. పినాక రాకెట్ లాంచర్లు, ఆకాష్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్, స్వాతి వెపన్-లొకేటింగ్ రాడార్లతో పాటు అధునాతన యుద్ధ విమానాల విడిభాగాలను కూడా విదేశీయులు పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్నారు. ఈ వేగవంతమైన పురోగతిని చూస్తుంటే 2029-30 నాటికి రక్షణ ఎగుమతుల్లో రూ. 50,000 కోట్ల లక్ష్యాన్ని భారత్ చాలా సులువుగా చేరుకుంటుందని రక్షణ శాఖా నిపుణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

గెట్ రెడీ విత్ మీ అంటున్న మోడీ

న్యూఢిల్లీ, ఆగస్టు 11, (న్యూస్ పల్స్)దేశంలో జెన్ జీ ఉద్యమం ప్రారంభమైంది. ఇందులో సోషల్ మీడియా ప్రముఖ పాత్రే పోషించింది. దీంతో రాజకీయ నేతలు కూడా అలర్ట్ అయ్యారు. మరీ ముఖ్యంగా నిత్యం టెక్నాలజీని వాడటంలో ముందుండే ప్రధాని మోదీ టెక్నాలజీని మరింత విస్తృతంగా వాడేస్తున్నారు. ఏది చెప్పాలన్నా, వీడియో రూపంలోనే తన సందేశాన్ని ఇస్తున్నారు. జంతర్ మంతర్ దగ్గర నిరసన ప్రారంభమైన తర్వాత ప్రధాని మోదీ ఏకంగా నాలుగు వీడియోల ద్వారా తన సందేశాన్ని పంపించారు. అందులో "ఫ్రెండ్స్" అంటూనే సంబోధించారు. అప్పటి నుంచి ఇక.. వీడియోల ద్వారానే తన సందేశాన్ని పంపిస్తున్నారు.తాజాగా కూడా ప్రధాని మోదీ ఇదే చేశారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని మోదీ, ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ఇందులో కూడా యువతనే టార్గెట్ గా చేస్తూ సంభాషించారు.ఒక కొత్త ఇన్‌స్టాగ్రామ్ రీల్‌ను పోస్ట్ చేస్తూ, చేనేత దుస్తులతో "గెట్ రెడీ విత్ మీ" వీడియోలను రూపొందించడం ద్వారా జాతీయ చేనేత దినోత్సవాన్ని జరుపుకోవాలని యువ భారతీయులకు విజ్ఞప్తి చేశారు. ఈ ట్రెండ్ భారతదేశపు గొప్ప నేత సంప్రదాయాన్ని ప్రదర్శించడానికి మరియు కళాకారుల కుటుంబాలకు మద్దతు ఇవ్వడానికి సహాయపడుతుందని ఆయన అన్నారు.చేనేత వస్త్రాలు ధరించి భారతీయ చేనేత సంప్రదాయాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంతో పాటు చేనేత కార్మికులకు, చిరు వ్యాపారులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూర్చేలా చిన్న వీడియోలను రూపొందించి సోషల్ మీడియాలో పోస్టు చేయాలని కోరారు. 1905 ఆగస్టు 7న బ్రిటీషర్లకు వ్యతిరేకంగా భారతీయులు స్వదేశీ ఉద్యమాన్ని ప్రారంభించారని ఆయన తన వీడియో సందేశంలో తెలిపారు.

ఉద్యమ్ రిజిస్ట్రేషన్ పోర్టల్ ఏర్పాటు

బాలానగర్ ,సూక్ష్మ మధ్య తరహా పరిశ్రమల(ఓంఇ) అభివృద్ధి చట్టం -2026 సవరణ బిల్లుకు లోకసభ ఆమోదం తెలిపిన నేపథ్యంలో..బాలానగర్ లోని ఓంఇ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఓంఇ ఆఈూ జాయింట్ డైరెక్టర్ సి.శివ శేషగిరి రావు మాట్లాడుతూ..20 ఏళ్ల తర్వాత ఇప్పుడు చేసిన సవరణ బిల్లు లో చట్టపరమైన వ్యవస్థ ,వ్యాపార సౌలభ్యం,సమస్యల పరిష్కారం లాంటి అంశాలు త్వరగా పరిష్కారం అవడానికి అవకాశం ఉంటుందన్నారు.ఈ సవరించిన చట్టంలో పెట్టుబడి,టర్నోవర్ ఆధారంగా ఎబఎవ వర్గీకరణను చట్టబద్ధం చేయడం, ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవడం కోసం ఉద్యమ్ రిజిస్ట్రేషన్ పోర్టల్ ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు.ఉద్యమ్ పోర్టల్ లో రిజిస్ట్రేషన్ చేసుకున్నాక గడిచిన మూడేళ్ళలో 1.65 కోట్ల నుంచి వినియోగదారులు 9.16 కోట్లకు పెరిగాయని ,దేశ వ్యాప్తంగా 40కోట్ల మందికి ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్స్ దశరథ్, ఎన్. సుమతి, గుళషన్ సింగ్ బిస్ట్, గురు స్వామి, నవీన్ కుమార్, దినేష్ కుమార్ పాల్గొన్నారు.

కాటా ఆమ్రపాలి.. స్మితా సబర్వాల్..

పోస్టింగ్ కోసం తిప్పలు

హైదరాబాద్, ఆగస్టు 11, (న్యూస్ పల్స్)కాటా ఆమ్రపాలి.. స్మితా సబర్వాల్.. మహిళా ఐఏఎస్ అధికారులు. వీరిద్దరిలో దూకుడు ఎక్కువ. డైనమిక్ గా పనిచేసే తీరు ఎక్కువ. పైగా వీరిని సూపర్ స్టార్ ఐఏఎస్ అధికారులు అని పిలిచేవారు. వార్తల్లో కూడా ఎక్కువగా కనిపించేవారు.అందానికి అందం.. పని తీరుకు పని తీరు.. ఫలితంగా వీరిద్దరూ మీడియాలో నిత్యం కనిపించేవారు. ఏకంగా ముఖ్యమంత్రి కార్యాలయాలలో పనిచేసే తమ సమర్థతను నిరూపించుకున్నారు. మీడియా వీరిద్దరి గురించి ఎక్కువగా వార్తలు రాస్తూ ఉండేది. సోషల్ మీడియాలో ఈ



ఇద్దరు అధికారులు ఎక్కువగా యాక్టివ్ గా ఉండేవారు. విపరీతమైన ఫ్యాన్ బేస్ ఉన్న ఈ అధికారులకు పోస్టింగ్ ఎందుకు లభించలేదు.. గ్రాఫ్ ఎందుకు తగ్గిపోయింది.. రాజకీయ సమీకరణాలు.. ఇతర అంశాలు వీరికి ఇబ్బందికరంగా మారాయా..ఆమ్రపాలి తనకు పోస్టింగ్ కేటాయించే విషయంలో న్యాయపోరాటం చేసింది. అందులో గెలిచింది. ఈమెకు డిపార్ట్మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ కేటాయింపులలో ఏపీ క్యాడర్ లభించింది. ఈమెకు మొదటి నుంచి కూడా తెలంగాణ రాష్ట్రంలో పనిచేయాలనేది బలమైన ఆకాంక్ష. అనేక రకాలుగా పోరాటాలు చేసినప్పటికీ ఈమె ఏపీ క్యాడర్లో పనిచేయాల్సి వచ్చింది. సరైన ప్రాధాన్యం లభించకపోవడంతో వరుసగా సెలవులు తీసుకున్నారు. ఆ తర్వాత ఎటువంటి బాధ్యతలు లేని నార్మల్ ట్రాన్స్ఫర్ ను ఎదుర్కొన్నారు. ఈయనకు సమర్థత ఉంది. కాకపోతే సమీకరణాలవల్ల పోస్టింగ్ కు దూరంగా ఉండాల్సి వస్తోంది. గతంలోని వరంగల్ కలెక్టర్ గా.. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ గా పని చేశారు. ఆ అనుభవాన్ని కూడా ప్రభుత్వం వినియోగించుకోలేదు.ఈమె క్రేజీ అధికారిగా పేరు తెచ్చుకుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఎక్కువకాలం తెలంగాణ రాష్ట్రంలో పనిచేశారు. ఇక ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత ముఖ్యమంత్రి కార్యాలయంలో కీలక అధికారిగా వ్యవహరించారు. ముఖ్యంగా మిషన్ భగీరథ వంటి ప్రాజెక్టులలో ముఖ్యపాత్ర పోషించారు. కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈమెకు విపరీతమైన ఫ్రీ హ్యాండ్ ఇచ్చారు. ఒక దశలో ఈమె నెక్స్ట్ టు సీఎం అన్నట్టుగా వ్యవహరించారు. ప్రభుత్వం మారిన తర్వాత స్మితకు ప్రాధాన్యం తగ్గిపోయింది. పైగా అస్మిత సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పరోక్ష విధానంలో విమర్శలు చేయడం మొదలుపెట్టారు. ఈమె వ్యవహార శైలిపై కూడా ప్రభుత్వ పెద్దలకు ఆగ్రహం ఉండడంతో ప్రాధాన్యం లేని విభాగాలు కేటాయించారు. దీంతో ఆమె ఆ బాధ్యతలు స్వీకరించడం కంటే.. ఖాళీగా ఉండడానికి ఇష్టాన్ని చూపించారు.ప్రభుత్వాలు మారినప్పుడు అధికారులకు ఇంపార్టెన్స్ తగ్గిపోతూ ఉంటుంది. అయితే కొంతమంది అధికారులు ప్రభుత్వాలకు తగ్గట్టుగా మారకుండా.. తమకంటూ ఓన్ స్టైల్ క్రియేట్ చేసుకోవడమే ఇక్కడ ఇబ్బందికరంగా మారుతుంది. స్మిత.. ఆమ్రపాలి వీరిద్దరూ సమర్థవంతమైన అధికారులు. రాజకీయ కారణాలవల్ల పోస్టులు లభించకపోవడంతో దీర్ఘకాలం సెలవులో ఉన్నారు ఇటువంటి అధికారులకు పోస్టింగులు లభించకపోవడం ఒకరకంగా ప్రజలకు ఇబ్బంది. సమర్థత ఉన్న అధికారులు దీర్ఘకాలం విశ్రాంతి తీసుకుంటే ప్రజా సమస్యలు పరిష్కారం కావడం దాదాపు అసాధ్యం.

12 ఏళ్లలో రైటాఫ్ రుణాల విలువ రూ. 10 లక్షల కోట్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 11, (న్యూస్ పల్స్)బ్యాంకులు, ఆర్థిక సంస్థలు పెద్ద పెద్ద వ్యాపారులకు, కార్పొరేట్లకు, ఇతర సర్వీస్ సెక్టార్లో బారోవర్లకు పెద్ద మొత్తంలో లోన్లు ఇస్తుంటాయి. ఇక్కడ చాలా మంది తిరిగి చెల్లించక మొండి బకాయిలు పెద్ద మొత్తంలో పేరుకుపోతుంటాయి. వీటిని బ్యాంకింగ్ పరిభాషలో నాన్ పెర్ఫామింగ్ అసెట్స్ అంటారు. ఇక బ్యాంకులు, ఆర్థిక సంస్థలు తాము ఇచ్చిన లోన్లను తిరిగి రాబట్టుకోవడం కష్టమనిపిస్తేవాటిని బ్యాంకులు తాత్కాలికంగా రద్దు చేస్తుంటాయి. దీనినే లోన్ రైటాఫ్ (లోన్లు సాంకేతికంగా రద్దు) అని పిలుస్తారు. ఇక్కడ గుర్తుంచుకోవాల్సింది ఏంటంటే రైటాఫ్ చేసినంత మాత్రాన లోన్లు రద్దయినట్లు కాదు. ఇది రుణ మాఫీ ఏ మాత్రం కాదు. లోన్ రికవరీ కోసం ప్రయత్నాలు చేస్తూనే ఉంటాయి. అయితే బ్యాలెన్స్ షీట్ నుంచి మాత్రమే ఈ లోన్లను తొలగిస్తారు. ఇక్కడ నిరర్ధక ఆస్తుల్ని తగ్గించుకునేందుకు, లాభదాయకత చూయించుకునేందుకు బ్యాంకులు చేసే సాంకేతిక ప్రక్రియనే లోన్ రైటాఫ్ అంటారు.ఇక ఇలా గత 12 ఏళ్లలో చూస్తే ఇలా పెద్ద కార్పొరేట్ రుణ గ్రహీతలకు ఇచ్చిన దాదాపు రూ. 9.95 లక్షల కోట్ల రుణాలను రైటాఫ్ చేశాయి. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటుకు వెల్లడించింది. ఇక్కడ రుణాల్ని రైటాఫ్ చేయడం అంటే రుణ గ్రహీతలకు అప్పును మాఫీ చేసినట్లు కాదని కేంద్ర ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి, లోక్‌సభలో ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో ఈ వివరాల్ని వెల్లడించారు. ఇక బ్యాంకుల రుణ రైటాఫ్‌లో గత కొన్నేళ్లుగా గణనీయమైన మార్పు కనిపిస్తోందని గణాంకాలు చెబుతున్నాయి.బ్యాంకులు రైటాఫ్ చేసిన రుణాల్లో అత్యధిక మొత్తం 2018-19 ఆర్థిక సంవత్సరంలో నమోదైంది. ఆ ఏడాదిలో ఏకంగా రూ. 1,48,753 కోట్ల రుణాల్ని బ్యాంకులు సాంకేతికంగా రద్దు చేశాయి. తర్వాతి సంవత్సరాల్లో చూస్తే రైటాఫ్ చేసిన రుణాల సంఖ్య క్రమంగా తగ్గుతూ వచ్చింది. కిందటి 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ. 20,485 కోట్ల రుణాల్ని రైటాఫ్ చేసినట్లు కేంద్రం వెల్లడించింది. 2018-19తో పోలిస్తే 2025-26 లో రైటాఫ్ చేసిన రుణాల మొత్తం భారీగా తగ్గింది. ఇక గత 12 ఏళ్ల లెక్కల్ని చూస్తే మాత్రం దాదాపుగా రైటాఫ్ రుణాల విలువ రూ. 10 లక్షల కోట్లకు చేరడం గమనార్హం.చాలా మంది మాత్రం రుణాల రైటాఫ్ అంటే రుణ మాఫీగా భావిస్తుంటారు. కానీ ఈ రెండూ ఒకటి కాదు. బ్యాంకులు తమ బ్యాలెన్స్ షీట్లను సరిచేసుకునేందుకు, మొండి బకాయిల్ని పుస్తకాల నుంచి తొలగించేందుకు రైటాఫ్ ప్రక్రియను ఉపయోగిస్తుంటాయి. ఇక్కడ రైటాఫ్ చేసినా బ్యాంకులు వర్తించే నిబంధనలు, చట్టపర మార్గాల ప్రకారం ఆ లోన్లను తిరిగి వసూలు చేసేందుకు చర్యలు కొనసాగించవచ్చు. చెల్లింపులు చేయకపోతే రుణాలు మొండి బకాయిలుగా మారతాయి. అలాంటి ఖాతాలపై బ్యాంకులు రికవరీ చర్యలు చేపడతాయి. అయితే కొన్ని సందర్భాల్లో లోన్ తిరిగి వసూలు చేయడం కష్టంగా మారుతుంది. ఇలాంటి పరిస్థితుల్లోనే నిబంధనలకు అనుగుణంగా బ్యాంకులు లోన్లను రైటాఫ్ చేయొచ్చు.

తెలంగాణలో సర్వేల గుబులు.. రెండేళ్లకు ముందేనా

హైదరాబాద్, ఆగస్టు 11, (న్యూస్ పల్స్)తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, ప్రధాన పార్టీలయిన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ లు ఇప్పటి నుంచే ప్రైవేట్ సంస్థల ద్వారా సర్వేలు నిర్వహిస్తుండటంతో అధికార, ప్రతిపక్ష శిబిరాల్లో టెన్షన్ నెలకొంది. మంత్రులు, ఎమ్మెల్యేల పనితీరుపై వస్తున్న రహస్య సర్వే నివేదికలు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారాయి. దీంతో అధికార పార్టీలో కలవరం రేగుతుంది. అదే సమయంలో ఈ సర్వేల్లో నిజమెంత? అబద్ధమెంత? అన్నది మాత్రం తెలియడం లేదు. తెలంగాణలో ఎన్నికలు జరగడానికి ఇంకా రెండేళ్లు సమయం ఉంది. జమిలీ ఎన్నికలు జరిగితే మూడేళ్ల తర్వాత కాని తెలంగాణలో ఎన్నికలు జరగవు... కానీ ముందే అనేక ప్రయివేటు సంస్థలు సర్వేలు నిర్వహిస్తు రాజకీయ పార్టీల్లో గుబులు రేపుతున్నాయి. అయితే ఇవి పెయిడ్ సర్వేలని తమకు అనుకూలంగా రాని పార్టీలు కొట్టిపారేస్తున్నా... ఎక్కడో ఏదో అనుమానం. ప్రజల్లో నిజంగా అసంతృప్తి ఉందా? అని అధికార పార్టీ, ప్రజల్లో తమ పార్టీకి అనుకూలత లేదా? అని విపక్ష పార్టీలు ఆందోళనలో పడ్డాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, హామీల అమలు తీరుపై ప్రజల నుంచి వస్తున్న స్పందనను అంచనా వేయడానికి పార్టీలు సర్వేలు చేపట్టాయి.నియోజకవర్గాల్లో నిధుల కొరత, ప్రజా వ్యతిరేకత ఎదుర్కొంటున్న కొంతమంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు, మంత్రుల పనితీరు ఆశించదగ్గ రీతిలో లేదని సర్వేల్లో వస్తున్న టాక్ గుబులు పుట్టిస్తోంది.. భవిష్యత్తులో టికెట్ల కేటాయింపునకు ఈ సర్వేలనే ప్రామాణికంగా తీసుకుంటారనే ప్రచారం నాయకుల్లో ఆందోళన కలిగిస్తోంది.రాజకీయ పార్టీల వ్యూహాలుఅధికార కాంగ్రెస్ పార్టీ తరఫున అంతర్గత సర్వేల ద్వారా ప్రజాభిప్రాయాన్ని బేరీజు వేస్తుండగా, ప్రతిపక్ష బీఆర్ఎస్ , బీజేపీ కూడా గ్రౌండ్ రియాలిటీపై దృష్టి పెట్టాయి.ఎప్పటికప్పుడు మారుతున్న రాజకీయ సమీకరణాలు, ప్రజా స్పందన ఆధారంగా పార్టీల వ్యూహాలను మారుస్తున్నాయి. తమకు సానుకూలత, అననుకూలత ఏ నియోజకవర్గాల్లో అంచనా వేసుకుని వాటిని దిద్దుకునే ప్రయత్నంలో ఉన్నాయి. మొత్తం మీద రెండేళ్ల ముందే సర్వేలు తెలంగాణ రాజకీయ పార్టీల్లో కాక రేపుతున్నాయనడంలో ఎటువంటి సందేహం లేదు.

కార్పొరేట్ పాఠశాలలా.. కబళించే స్కూళ్లా

హైదరాబాద్, ఆగస్టు 11, (న్యూస్ పల్స్)ఉత్తమమైన విద్య అందుతుందని.. ఉపాధ్యాయులు మెరుగ్గా బోధన చేస్తారని.. తమ పిల్లలు ప్రయోజకులవుతారని చాలామంది తల్లిదండ్రులు కార్పొరేట్ పాఠశాలలకు పంపిస్తుంటారు. అప్పులు తెచ్చి అయినా సరే తమ పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తుంటారు.ప్రభుత్వ పాఠశాలల్లో సరైన సదుపాయాలు ఉండవని.. ఉపాధ్యాయులలో జవాబుదారితనం కనిపించదని.. పిల్లలకు సక్రమమైన విద్య అందదని భావించే తల్లిదండ్రులు.. తమ స్తోమతకు మించినా సరే పిల్లలను కార్పొరేట్ పాఠశాలల్లో చేర్పిస్తుంటారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని కాపాడి.. విద్యార్థులకు ఉత్తమమైన విద్య అందించి.. మెరుగైన సదుపాయాలు కల్పించాల్సిన యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి. తల్లిదండ్రుల నుంచి లక్షలకు లక్షలు ఫీజులు వసూలు చేస్తూ.. విద్యార్థులను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయి.యాజమాన్యాల నిర్లక్ష్య వైఖరి విద్యార్థుల పాలిట శాపంగా మారుతుంది. పైగా ఆ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలగాల్సిన చోట దారుణంగా వ్యవహరిస్తున్నారు. హైదరాబాద్ నగరానికి దగ్గరలో ఉన్న దమ్మాయిగూడ లో శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థుల మధ్య ర్యాగింగ్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఒక పదవ తరగతి విద్యార్థిని తోటి విద్యార్థులు కర్రలతో కొట్టారు. బూటు కాళ్లతో తన్నారు.. ఈ విషయం ఆ విద్యార్థి తల్లిదండ్రుల పరిశీలనలో వెలుగులోకి వచ్చింది. తోటి విద్యార్థుల దాడిలో గాయపడిన అభిషేక్ అనే విద్యార్థి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మరోవైపు ఈ వ్యవహారాన్ని ఆసుపత్రి యాజమాన్యం మరో విధంగా చిత్రీకరించడం మొదలుపెట్టింది. ఆ విద్యార్థి మెట్లపై నుంచి పడినట్టు చెబుతోంది. వాస్తవానికి విద్యార్థుల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఉండేలాగా యాజమాన్యం కృషి చేయాలి. విద్యార్థుల మెరుగైన భవిష్యత్తు కోసం బాటలు పరచాలి. తోటి విద్యార్థుల మధ్య ఈ స్థాయిలో ర్యాగింగ్ జరిగింది అంటే అది ముమ్మాటికి యాజమాన్యం నిర్లక్ష్యమే.ఉన్నతమైన చదువులు చెప్తారని శ్రీ చైతన్య లో చేర్పించాం. భారీగా ఫీజులు కూడా చెల్లిస్తున్నాం. అయినప్పటికీ ఇక్కడ విద్యార్థులకు సరైన సెక్యూరిటీ లేదు. తోటి విద్యార్థులు ఒకరిని ఒకరు కొట్టుకుంటుంటే మేనేజ్మెంట్ ఏం చేస్తోంది.. విద్యార్థులను పర్యవేక్షించాలి కదా.. నిత్యం కనిపెట్టుకొని ఉండాలి కదా. ఇంతలా దాడులు చేసుకున్నారంటే ఏమనుకోవాలి.. ర్యాగింగ్ విష సంస్కృతి ఈ స్థాయిలో పెచ్చరిల్లిపోతుంటే మేనేజ్మెంట్ నిశ్శబ్దంగా ఉంది.. మా అబ్బాయి పరిస్థితి చూస్తే దారుణంగా ఉందని అభిషేక్ తల్లిదండ్రులు చెప్తున్నారు. మరి దీనిపై యాజమాన్యం ఇంతవరకు స్పందించలేదు.

డబుల్‌డెక్ కారిడార్ డీపీఆర్ రెడీ

హైదరాబాద్, ఆగస్టు 11, (న్యూస్ పల్స్)హైదరాబాద్?ముంబయి జాతీయ రహదారిలో చందానగర్?గంగారం వద్ద ఫ్లైఓవర్‌పై మెట్రో వయాడక్ట్ ఉండేలా డబుల్‌డెక్ డిజైన్‌ను ఔఊంఎ, ఊంఖీఓ సంయుక్తంగా ఖరారు చేశాయి. మియాపూర్?పటాన్‌చెరు మెట్రో విస్తరణతో సమన్వయం చేసేందుకు ఈ నమూనాను ప్రతిపాదించారు. మరోవైపు ఎల్బీనగర్?హయత్‌నగర్‌లోనూ డబుల్‌డెక్ నిర్మించాలని మంత్రి కోమటిరెడ్డి కోరుతున్నారు. అయితే అక్కడ మెట్రో అలైన్‌మెంట్ ఇప్పటికే సర్వీస్ రోడ్డు వెంట ఖరారై,డీపీఆర్ కేంద్రానికి చేరడంతో మార్పులు చేస్తే ఆలస్యం, వ్యయం పెరుగుతాయని అధికారులు చెబుతున్నారు.హైదరాబాద్ నగరంలో రోడ్డు, మెట్రో మౌలిక వసతులను సమన్వయంతో అభివృద్ధి చేసేందుకు మరో కీలక అడుగు పడింది. నగరం నుంచి ముంబయి వైపు వెళ్లే జాతీయ రహదారి మార్గంలో చందానగర్?గంగారం ప్రాంతం వద్ద డబుల్‌డెక్ నిర్మాణానికి సంబంధించిన డిజైన్‌ను జాతీయ రహదారుల సంస్థ, హైదరాబాద్ మెట్రోరైలు లిమిటెడ్ సంయుక్తంగా ఖరారు చేసినట్లు తెలిసింది. ఈ మార్గంలో ఒకే కారిడార్‌లో రహదారి ఫ్లైఓవర్‌తో పాటు దాని పైన మెట్రో వయాడక్ట్ నిర్మించేలా డిజైన్ రూపొందించారు.ప్రస్తుతం మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు మెట్రోరైలు విస్తరణకు ప్రతిపాదనలు ఉన్నాయి. ఇదే మార్గంలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు జాతీయ రహదారుల సంస్థ ఫ్లైఓవర్ల నిర్మాణాన్ని చేపడుతోంది. ఒకే ప్రాంతంలో భవిష్యత్తులో రోడ్డు ఫ్లైఓవర్, మెట్రో మార్గాలను వేర్వేరుగా నిర్మిస్తే భూసేకరణ, స్థల లభ్యత, నిర్మాణ వ్యయం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. దీంతో రెండు ప్రాజెక్టులను సమన్వయం చేసి డబుల్‌డెక్ రూపంలో నిర్మించాలనే ఆలోచనకు ప్రాధాన్యం లభించింది.ఫ్లైఓవర్ నిర్మించాల్సిన ప్రాంతాల్లో భవిష్యత్తులో మెట్రో విస్తరణ ఉంటే ముందుగానే డబుల్‌డెక్ నమూనాను పరిగణనలోకి తీసుకోవాలని కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గతంలో సూచించారు. కింద రహదారి వాహనాల కోసం ఫ్లైఓవర్, దాని పైన మెట్రో వయాడక్ట్ ఉండే విధంగా ఈ నిర్మాణం ఉంటుంది. నాగ్‌పూర్‌లో ఇలాంటి డబుల్‌డెక్ కారిడార్‌ను దేశంలోనే తొలిసారిగా నిర్మించారు. ఒకే మార్గంలో రెండు రవాణా వ్యవస్థలకు స్థలం కల్పించడం ద్వారా భూసేకరణ అవసరాన్ని తగ్గించడంతో పాటు నగరాల్లో పరిమిత స్థలాన్ని సమర్థంగా వినియోగించుకోవచ్చన్నది ఈ నమూనా ఉద్దేశమని అధికారులు చెబుతున్నారు.ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ల నిర్మాణానికి ప్రతిపాదనలు ఉన్నాయి. ఈ మార్గంలోనూ డబుల్‌డెక్ నిర్మించాలని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పట్టుబడుతున్నారు. అయితే చందానగర్?గంగారం మార్గంతో పోలిస్తే ఇక్కడ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ఎల్బీనగర్?హయత్‌నగర్ మెట్రో విస్తరణకు సంబంధించిన అలైన్‌మెంట్‌ను ఇప్పటికే సర్వీస్ రహదారి వెంబడి ప్రతిపాదించారు. దీనికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికలు కూడా కేంద్ర ప్రభుత్వానికి పంపించారు. ఇప్పుడు ఈ అలైన్‌మెంట్‌ను మార్చి ఫ్లైఓవర్‌పై మెట్రోను ఏర్పాటు చేసేలా డబుల్‌డెక్ నమూనాను అమలు చేస్తే ఇప్పటికే సిద్ధం చేసిన డీపీఆర్‌లో మార్పులు చేయాల్సి ఉంటుంది.డీపీఆర్‌లో మార్పులు, కొత్త డిజైన్, సాంకేతిక పరిశీలనలు, అనుమతుల ప్రక్రియ కారణంగా ప్రాజెక్టు అమలులో జాప్యం జరిగే అవకాశం ఉందని మెట్రోరైలు అధికారులు మంత్రికి వివరించినట్లు సమాచారం. అదనంగా నిర్మాణ వ్యయం కూడా పెరిగే అవకాశముందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే ప్రతిపాదించిన మెట్రో అలైన్‌మెంట్‌ను కొనసాగిస్తే పనులను వేగంగా ముందుకు తీసుకెళ్లే అవకాశం ఉంటుందని వారు సూచించినట్లు తెలిసింది.మరోవైపు హైదరాబాద్ మెట్రో రెండోదశకు కేంద్ర అనుమతులు త్వరలో వచ్చే అవకాశం ఉందన్న ఆశాభావం ప్రభుత్వ వర్గాల్లో వ్యక్తమవుతోంది. మరో రెండు నెలల్లో రెండోదశకు సంబంధించిన అనుమతులు వస్తాయని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆశాభావం వ్యక్తం చేసిన నేపథ్యంలో, మెట్రో మార్గాల తుది అలైన్‌మెంట్, ఫ్లైఓవర్లతో సమన్వయం వంటి అంశాలు కీలకంగా మారాయి.

రీల్ టీచర్స్...

ఖమ్మం, ఆగస్టు 11, (న్యూస్ పల్స్)ఆమె పేరు గౌతమి రాథోడ్. పేరుకు తగ్గట్టుగానే అందంగా ఉంటుంది. గొంతు కూడా శ్రావ్యంగా ఉంటుంది. పైగా గవర్నమెంట్ టీచర్. రీల్స్ చేయడం ఆమె చాలా ఇంట్రెస్ట్. తాను పనిచేస్తున్న స్కూల్లో రీల్స్ చేసేది.రీల్స్ ద్వారా ఆమె సోషల్ మీడియాలో విపరీతంగా పాపులారిటీ సంపాదించుకుంది. సెలబ్రిటీ అయిపోయింది. అనుసరించే వారు కూడా భారీగా ఉండటంతో ఆమె రేంజ్ పెరిగిపోయింది. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ.. వచ్చిన ఫేమ్ ద్వారా ఆమె కొన్ని ప్రవేట్ సంస్థలకు ప్రచారం చేస్తున్నట్టు విద్యాశాఖకు ఫిర్యాదులు అందాయి. దీంతో విద్యాశాఖ అధికారులు రంగంలోకి దిగారు. విచారణ నిర్వహించారు. ఆమెను సస్పెండ్ చేశారు.ఇటీవల ఆమెకు పోస్టు లభించింది. విధుల్లోకి వెళ్లాల్సిన ఆమె సోషల్ మీడియా ద్వారా ఒక వీడియో రిలీజ్ చేశారు. తన ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఆమె నిర్ణయం ఒక రకంగా సంచలనం కలిగించింది. ఆమె రీల్స్ చేస్తున్నప్పుడు తోటి ఉద్యోగులు హేళనకు గురిచేసారట. ఆమెను ఇబ్బంది పెట్టారట. తట్టుకోలేక కష్టపడి సాధించిన ఉద్యోగాన్ని వదులుకున్నానని గౌతమి సోషల్ మీడియాలో ఒక వీడియో విడుదల చేసింది. తాను స్కూల్లో.. విద్యార్థులకు పాఠాలు చెప్పే సమయంలో ఎటువంటి రీల్స్ చేయలేదని ఆమె స్పష్టం చేసింది. ఒకవేళ తాను అలా రీల్స్ చేసి ఉంటే విద్యార్థులు లేదా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు తనమీద ఫిర్యాదు చేసి ఉండేవారు కదా అంటూ ఆమె ప్రశ్నించారు.అప్పట్లో గౌతమి మీద విద్యాశాఖ సస్పెన్షన్ వేటు వేసినప్పుడు..

నారాయణపూర్ ముంపు బాధితుల పోరాటం

- "ఇళ్లకు కాదు.. గ్రామానికే పరిహారం ఇవ్వాలి"

- బాధితులకు అండగా మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

కరీంనగర్ , జిల్లాలోని గంగాధర మండలం నారాయణపూర్ గ్రామంలో చెరువు విస్తరణ, ఎల్లంపల్లి జలాశయం నుంచి నీటి నింపుదలతో ముంపు ముప్పు పెరిగిందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువు విస్తరణ కోసం ప్రభుత్వం నిధులు కేటాయించడంతో పాటు, కట్ట కింద ఉన్న కొన్ని ఇళ్లకు మాత్రమే పరిహారం మంజూరు చేయడాన్ని గ్రామస్థులు వ్యతిరేకిస్తున్నారు. నారాయణపూర్‌తో పాటు ఇస్తారుపల్లి, చర్లపల్లి, ఎన్.మంగపేట గ్రామాలకు ముంపు భయం ఉందని, గ్రామంలోని సుమారు 300 కుటుంబాలకు పరిహారం అందించి మొత్తం గ్రామాన్నే ముంపు గ్రామంగా ప్రకటించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హామీలు ఇచ్చారని ... ఇప్పుడు ముంపు సమస్యపై ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి భయపెడుతున్నారంటూ గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇటీవల గ్రామంలో జరిగిన పరిణామాల నేపథ్యంలో నమోదైన కేసులను ఎత్తివేయాలని కూడా డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నారాయణపూర్ గ్రామస్తులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. దీక్షకు చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సంఘీభావం తెలిపి బాధితులకు అండగా నిలిచారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, తమ సమస్యలపై ప్రశ్నిస్తున్న ప్రజలపై కేసులు పెట్టడం సరికాదని సుంకె రవిశంకర్ విమర్శించారు. "ప్రజల గొంతు నొక్కడం కాదు.. వారి సమస్యకు పరిష్కారం చూపాలి. నారాయణపూర్‌ను ముంపు గ్రామంగా ప్రకటించి బాధితులకు న్యాయం చేయాలి" అని డిమాండ్ చేశారు. నారాయణపూర్ ముంపు సమస్యపై ప్రభుత్వం వెంటనే స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు

సారపాకలో ఇసుక అక్రమ వ్యాపారం



బూర్గంపహాడ్, ఆగస్టు 11 : పారిశ్రామికవాడ సారపాకలోని పలు కాలనీల్లో ఎక్కడ పడితే అక్కడ ఇసుక స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేస్తూ ఇసుక మాఫియా అక్రమ ఇసుక వ్యాపారం యథేచ్ఛగా సాగిస్తున్నారు. సారపాకలోని భాస్కరనగర్, మసీద్ రోడ్, రాజీవ్‌నగర్ ఇలా ఎక్కడ పడితే అక్కడ ఇసుక మాఫియా తమకు నచ్చిన చోట స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేసుకుని ఇసుకను రాశులుగా పోసి సామాన్యులకు అధిక ధరలకు విక్రయిస్తూ వ్యాపారాన్ని మూడు పువ్వులు?ఆరు కాయలుగా సాగిస్తున్నారు. అక్రమ ఇసుక నిల్వలకు సంబంధించి ఇటీవల కాలంలో 'నమస్తే తెలంగాణ' కథనాలు సైతం ప్రచురించింది. సంబంధిత అధికారులు ఇసుక నిల్వలను సీజ్ చేసినప్పటికీ ఇసుక మాఫియా మాత్రం పదే పదే మళ్లీ అదే వ్యాపారాన్ని సాగిస్తూ ఎవరైతే మాకేంటి అన్నచందంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలూ వెల్లువెత్తుతున్నాయి. అక్రమంగా ఇసుక నిల్వలను ఏర్పాటు చేసిన ప్రదేశాలను రెవెన్యూ అధికారులు గుర్తించి వాటిని సీజ్ చేయాలని, ఇసుక సామాన్యులకు న్యాయమైన ధరకు అందేలా చూడాలని, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

సిరియా మాజీ అధ్యక్షుడు బాషర్ అల్ అసద్‌కు మరణశిక్ష ఖరారు

డమస్కస్: సిరియా మాజీ అధ్యక్షుడు బాషర్ అల్ అసద్‌కు .. స్థానిక కోర్టు మరణశిక్షను ఖరారు చేసింది. యుద్ధ నేరాలకు పాల్పడిన కేసులో ఆ శిక్షను విధించారు. సుమారు 14 ఏళ్ల పాటు సిరియాలో అంతర్యుద్ధాన్ని కొనసాగించారని, దాన్ని మర్డర్‌గా తేల్చుతూ శిక్షను ఖరారు చేశారు. అసద్ సోదరుడు మాహెర్ అల్ అసద్‌కు కూడా యుద్ధ నేరాల కింద మరణశిక్షను ఖరారు చేశారు. అయితే ఇద్దరూ కూడా ఈ కేసులో కోర్టుకు ప్రత్యక్షంగా హాజరు కాలేదు. బాషర్ తరపున ఆయన తల్లి బంధువు ఆతెప్ నాజిబ్ హాజరయ్యారు.సిరియా న్యాయ వ్యవస్థ తొలిసారి బాషర్ అల్ అసద్‌కు మరణశిక్షను ఖరారు చేసింది.2024 డిసెంబర్‌లో అసద్‌తో పాటు ఆయన ఫ్యామిలీ రష్యాకు పరారీ అయిన విషయం తెలిసిందే. హయ్యత్ తాహిర్ అల్ షామ్ నేతృత్వంలోని విపక్ష దళాలు డమస్కస్‌కు దూసుకురావడంతో బాషర్ దేశం విడిచి పారిపోయారు. దీంతో సిరియాలో సుమారు 50 ఏళ్ల అసద్ ఫ్యామిలీ పాలన అంతమైంది.మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడడం, సామూహిక హత్యలకు పాల్పడిందెవరో అన్న కోణంలో విచారణ చేపట్టారు. సిరియా మాజీ అధ్యక్షుడు అసద్‌కు రష్యా ఆశ్రయం కల్పించిన విషయం తెలిసిందే. సిరియాలో జరిగిన మారణహోమంలో సుమారు 5 లక్షల మంది మరణించారు. లక్షల సంఖ్యలో జనం నిరాశ్రయులయ్యారు.



2024లోనూ జేఎస్ఎస్సీ-సీజీఎల్ పేపర్ లీక్..

రూ.12 లక్షలు చెల్లించిన ఒక్కో అభ్యర్థి

న్యూఢిల్లీ ,జార్ఖండ్‌లో పేపర్ లీకేజీ అంశం సంచలనం కలిగిస్తోంది. ఇటీవల జరిగిన జేపీఎస్సీ, జేఎస్ఎస్సీ పేపర్ లీకేజీలపై రాష్ట్రంలో సీఐడీ విచారణ జరుగుతోంది. ఈ విచారణలో సంచలన విషయాలు వెలుగుచూశాయి. 2024లోనూ పేపర్ లీకేజీ జరిగినట్లు తాజాగా వెల్లడైంది. 2024లో జరిగిన జేఎస్ఎస్సీ కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ (సీజీఎల్) పేపర్ లీకైనట్లు సీఐడీ విచారణలో కీలక నిందితుడు అభయ్ తివారి అలియాస్ మనోజ్ కుమార్ తివారి చెప్పాడు. జేపీఎస్సీ, జేఎస్ఎస్సీ పేపర్ లీకేజీ కేసులో అభయ్ తివారిని సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. అతడి విచారణలో ఈ విషయాలు బయటపడ్డాయి.తివారి వెల్లడించిన వివరాల ప్రకారం.. 2024లో జేఎస్ఎస్సీ-సీజీఎల్ పరీక్షా పత్రాల్ని కొందరు అభ్యర్థులకు విక్రయించారు. ఒక్కో అభ్యర్థి రూ.12 లక్షలు చెల్లించి, వారికి పరీక్షా పత్రాల వివరాలు అందించారు. అలా, మొత్తం 15 మంది అభ్యర్థుల నుంచి రూ.1.80 కోట్లు వసూలు చేశారు. అలాగే, 45 మంది అభ్యర్థులను బొకారోలోని ఒక ఇంటికి తీసుకెళ్లారు. అక్కడ అభ్యర్థులకు ప్రశ్నాపత్రంలోని 65 ప్రశ్నలు చెప్పారు. వాటికి జవాబులు గుర్తుంచుకునేలా శిక్షణ ఇచ్చారు. పరీక్షా పత్రాల ముద్రణను వెబెల్ సంస్థకు అప్పగించారు. నిందితుడు అభయ్ తివారి కూడా ఈ పరీక్షల్లో 48వ ర్యాంకు సాధించాడు. అతడితోపాటు సోదరుడు అక్షయ్ తివారి, భార్య సుష్మా కుమారి కూడా మంచి ర్యాంకులు సాధించి, ఉద్యోగాలు కూడా పొందారు. ఈ కేసుకు సంబంధించి జేపీఎస్సీ మాజీ ఛైర్మన్ ఎల్ ఖియాంగ్తేను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు.అతడు గత నెలలోనే తన పదవికి రాజీనామా చేశారు. ప్రస్తుతం అతడిని సీఐడీ అధికారులు విచారిస్తున్నారు. మరోవైపు ఈ కేసును సీబీఐకి అప్పగించాలంటూ జార్ఖండ్ విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే, ఇటీవల జరిగిన జేపీఎస్సీ, జేఎస్ఎస్సీ పరీక్షల్ని రద్దు చేయాలని కూడా విద్యార్థులు కోరుతున్నారు. కానీ, వీటికి ప్రభుత్వం తలొగ్గడం లేదు. దీంతో విద్యార్థులకు, ప్రభుత్వానికి మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ప్రభుత్వంపై విద్యార్థులు తిరుగుబాటు చేస్తున్నారు. సోమవారం విద్యార్థులు అసెంబ్లీ ముట్టడికి యత్నించగా, పోలీసులు వారిపై లాఠీఛార్జి చేశారు. టియర్ గ్యాస్, వాటర్ కెనాన్లు ప్రయోగించారు. అయినప్పటికీ విద్యార్థులు అసెంబ్లీ వద్దకు చేరుకున్నారు. మరోవైపు మంగళవారం కూడా రాంచీలో ఆందోళనలు కొనసాగుతున్నాయి.



తమిళనాడులో కొత్త వివాదం! అబార్షన్ హక్కు వ్యతిరేక ర్యాలీలో అసెంబ్లీ స్పీకర్

ఇటీవల జరిగిన అబార్షన్ వ్యతిరేక ర్యాలీలో తమిళనాడు అసెంబ్లీ స్పీకర్ జేసీడీ ప్రభాకర్ పాల్గొనడం వివాదాస్పదంగా మారింది. స్పీకర్ తీరు మహిళా హక్కులకు వ్యతిరేకమంటూ రాజకీయ ప్రత్యర్థులు, సామాజిక కార్యకర్తలు మండిపడుతున్నారు.చెన్నైలో ఆగస్టు 8,9 తేదీల్లో మార్చ్ ఫర్ లైఫ్ పేరిట ఈ ర్యాలీ జరిగింది. మద్రాస్-మైలాపోర్ ఆర్చిడయోసీస్ ఆధ్వర్యంలో స్టెల్లా మేరీ కాలేజీలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దాదాపు 5 వేల మంది ఈ కార్యక్రమంలో హాజరయ్యారు. పసి ప్రాణాలను మొగ్గలోనే చిదిమేసే అబార్షన్‌లను సభలో అనేక మంది వ్యతిరేకించారు. ఈ సందర్భంగా ఎమ్‌టీపీ యాక్ట్‌పై కూడా విమర్శలు వచ్చాయి. ఈ సందర్భంగా గర్భధారణతోనే ఓ కొత్త జీవి ప్రాణం పోసుకుంటుందన్న అసెంబ్లీ స్పీకర్ వ్యాఖ్యలు కాంట్రవర్సీకి దారి తీశాయి. 'గర్భస్థ శిశువుకు కూడా గౌరవం ఉంటుంది. ఈ భావాన్ని వ్యక్తీకరించే వేదికగా ఈ కార్యక్రమం జరుగుతోంది. పిల్లలు అందరూ దేవుడి దీవెనలే. ఈ దీవెనను వ్యతిరేకించే ఆలోచన ఎవరి మనసుల్లోనూ ఉండకూడదు' అని స్పీకర్ అన్నారు.ఈ కామెంట్స్‌పై రాష్ట్రంలో పలువురు మహిళా హక్కుల కార్యకర్తల విమర్శలు గుప్పించారు. గర్భధారణకు సంబంధించి మహిళల హక్కులకు ప్రాధాన్యమిస్తూ 2021లో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును అనేక మంది ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఆర్టికల్ 21 ప్రకారం సేఫ్ అబార్షన్ కూడా ప్రాథమిక హక్కు అని పేర్కొన్నారు. ఈ ర్యాలీ అసెంబ్లీ స్పీకర్ ఎలా పాల్గొంటారని, స్పీకర్ వాదనతో సీఎం కూడా ఏకీభవిస్తున్నారా? అని షాలిన్ మారియా లారెన్స్ అనే మహిళా హక్కుల కార్యకర్త ప్రశ్నించారు.



మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌ను చరిత్ర మరువదు: సోనియా గాంధీ



కోల్ స్కామ్ కేసులో దివంగత నేత, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు సుప్రీం కోర్టు క్లీన్ చిట్ ఇవ్వడంపై కాంగ్రెస్ నేత సోనియా గాంధీ మంగళవారం కీలక వ్యాఖ్యలు చేశారు. మాజీ ప్రధాని సింగ్‌ను అత్యంత ప్రభావశీలమైన ప్రధానిగా, మృదుస్వభావిగా చరిత్ర ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని వ్యాఖ్యానించారు. ప్రస్తుత ప్రభుత్వంతో పోలిస్తే ఆయన తన నైతికత, జవాబుదారితనంతో పూర్తి భిన్నమైన వ్యక్తిగా కనిపిస్తారని అన్నారు.ఈ తీర్పుతో భారత రాజకీయంలో ఒక విషాదకర ఘట్టానికి ముగింపు పడిందని వ్యాఖ్యానించారు. నీతినిజాయతీ కలిగిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌ను దోషిగా నిలబెట్టే ప్రయత్నానికి ఫుల్ స్టాప్ పడిందని వ్యాఖ్యానించారు. 'దివంగత నేత మన్మోహన్ సింగ్‌కు వ్యతిరేకంగా ఒక లాబీ పూర్తిసన్నద్ధతతో, సమన్వయంతో పనిచేసింది. అధికార గణం మొదలు న్యాయవ్యవస్థకు చెందిన వారు, పౌర సమాజం, ఆర్ఎస్ఎస్ బీజేపీ అందరూ ఉన్నారు. నాటి ఆరోపణలన్నీ బోగస్ అని నేడు రుజువైంది. డా. మన్మోహన్ సింగ్ నిర్దోషి అన్న విషయం స్పష్టంగా తేలింది' అని ఓ జాతీయ వార్త పత్రికలోని వ్యాసంలో సోనియా గాంధీ రాసుకొచ్చారు.ప్రత్యర్థులను టార్గెట్ చేసేందుకు ఈడీ, సీబీఐ వంటి సంస్థలను మోదీ ప్రభుత్వం దుర్వినియోగపరిచిందని కూడా ఎంపీ సోనియా గాంధీ ఆరోపించారు. 'వాటి లక్ష్యం ప్రత్యర్థులపై ఒత్తిడి తేవడమే. కొందరి గొంతు నొక్కారు. మరికొందరిని బీజేపీలో కలిపేసుకున్నారు. మరికొన్ని అసాధారణ సందర్భాల్లో కొందరికి మంత్రి పదువులు కూడా దక్కాయి' అని సోనియా గాంధీ విమర్శించారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌పై ప్రధాని మోదీ చేసిన కామెంట్స్ దేశ పార్లమెంటు చరిత్రలో అత్యంత దిగజారిన క్షణంగా నిలిచిపోతాయని అన్నారు. ఇటీవల కాలంలో విద్యార్థులను క్షమిస్తున్న ప్రధాని మోదీ ఈ విషయంలో తనని తాను క్షమించుకోవాలని చురకలంటించారు.

రేవంత్‌రెడ్డి మరో సోదరుడు జగదీష్ రెడ్డి ఎంవోయూ సంగతేంటో..? : కేటీఆర్



హైదరాబాద్, ఆగస్టు 11, అనుముల జగదీష్ రెడ్డి అని రేవంత్ రెడ్డికి మరో సోదరుడున్నారు. ఆయన అమెరికాలో ఉంటరు. రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు పోతే.. జగదీష్ రెడ్డి, రేవంత్‌రెడ్డి ఇద్దరు అన్నదమ్ములు కలిసి స్వచ్ బయో అనే కంపెనీతో రూ.1000 కోట్లకు ఎంవోయూ చేసుకున్నారని ఒక ఫోటో దిగారు. మరి అదేమైందో..? వాళ్లకు కూడా భూమి ఎక్కడో ఇచ్చాడో అది కూడా తవ్వి తీయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారఈ విషయమై కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి బావమరిది సృజన్ రెడ్డికి రేవంత్ సర్కార్, మోదీ సర్కార్ కలిసి రూ.1137 కోట్ల అమృత్ కాంట్రాక్టులు ఇస్తున్నారు. అట్లాగే రేవంత్ సర్కార్, మోదీ సర్కార్ కలిసి నడుపుతున్న సింగరేణిలో సృజన్ రెడ్డి కనుసన్నల్లోనే మొత్తం నడుస్తోందన్నారు. సైట్ విజిటేషన్ సర్టిఫికెట్లు వేల కోట్ల కుంభకోణాలు..ఇవన్నీ గతంలో బయటపెట్టాం. మళ్లీ చెప్పమంటే మళ్లీ చెప్తాం. సైట్ విజిటేషన్ సర్టిఫికెట్లు అనే నిబంధనలు అడ్డం పెట్టి ఏరకంగా చేస్తున్నారూ.రాజగా మా తమ్ముడు మన్నె క్రిశాంక్ వెలుగులోకి తీసుకొచ్చింది అనుముల కొండల్ రెడ్డి టెసరాక్ట్ అనే కంపెనీ బాగోతం. కంపెనీకి ఒక్క ఉద్యోగి లేదు.. రూపాయి ఆదాయం లేదు. రూ.లక్ష మూలధనం.. ఆఫీస్ అడ్రస్ లేదు.. కానీ వడ్డించే వాడు మనవాడైతే ఎక్కడ కూర్చుంటే ఏముంది..? ఇవాళ రూ.200 కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని గజం 3700 రూపాయల చొప్పున కేవలం రూ.7 కోట్లకు కొండల్‌రెడ్డికి అన్నగారు రాసిచ్చాడు. మరి ఇది స్కామా.. కాదా..? పక్క రాష్ట్రం కర్ణాటకలో ముఖ్యమంత్రి సతీమణికి ఆనాడు 3 ఎకరాల స్థలం ఇస్తేనే ఆ ముఖ్యమంత్రి రాజీనామా చేసే పరిస్థితి వచ్చింది. తప్పకుండా ఈ అంశాన్ని వదిలిపెట్టమని కేటీఆర్ హెచ్చరించారు.

తెలంగాణలో తగ్గుతున్న ప్రభుత్వ స్కూళ్ల సంఖ్య



హైదరాబాద్: తెలంగాణలో ప్రభుత్వ స్కూళ్ల(సంఖ్య క్రమంగా తగ్గుతున్నది. గడిచిన ఏడాదితో పోలిస్తే.. 2025-26 సంవత్సరంలో 1969 ప్రభుత్వ స్కూళ్లు మూతపడ్డాయి. మరో వైపు ప్రైవేటు స్కూళ్ల సంఖ్య మాత్రం రాష్ట్రంలో పెరుగుతున్నట్లు తెలిసింది. ఇదే వార్షిక సంవత్సరంలో రాష్ట్రంలో 771 ప్రైవేటు స్కూళ్ల సంఖ్య పెరిగినట్లు విద్యాశాఖకు చెందిన యునిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్ డేటా ద్వారా వెల్లడైంది. గత పదేళ్లలో తెలంగాణలో యూడీఐఎస్ఈ ప్లస్ డేటా ప్రకారం ప్రైవేటు స్కూళ్ల సంఖ్య 41 శాతం పెరిగింది. వీటిల్లో విద్యార్థుల ఎన్‌రోల్మెంట్ 64.5 శాతంగా ఉన్నట్లు తెలిసింది.మరో వైపు ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల నమోదు ప్రక్రియ క్షీణించింది. ఎన్‌రోల్మెంట్ 8 శాతం తగ్గినట్లు డేటా ప్రకారం తెలుస్తోంది. ప్రైవేటు స్కూళ్లు పేరెంట్స్, విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి. అయితే కోవిడ్19 మహమ్మారి సమయంలో ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల ఎన్‌రోల్మెంట్ పెరిగినా.. ఇప్పుడు మళ్లీ ఆ సంఖ్య తగ్గడం కొంత కలవరపడే అంశమే అవుతుంది. 2016-17 నుంచి 2025-26 మధ్య కాలంలో తెలంగాణలో ప్రభుత్వ స్కూళ్ల సంఖ్య 43,134 నుంచి 41,762కు పడిపోయింది. సుమారు 3.2% ప్రభుత్వ స్కూళ్లు మూతపడినట్లు తెలుస్తోంది.

ఓటు తొలగించటంపై వ్యంగ్యంగా స్పందించిన ప్రకాశ్ రాజ్

బెంగళూరు, ఆగస్టు 11: కర్ణాటకలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఎలక్షన్ కమిషన్ తన ఓటును తొలగించటంపై బహుభాషా నటుడు ప్రకాశ్ రాజ్ వ్యంగ్యంగా స్పందించారు. తను పుట్టి, పెరిగిన ప్రాంతం నుంచి ఓటును తొలగించటం ఓ పెద్ద జోక్ అని ఆయన అన్నారు. ఓటును ఎలాగైనా తిరిగి పొందుతానని స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు.ఆ పోస్టులో.. 'కర్ణాటకలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా బెంగళూరు నియోజకవర్గం నుంచి



నా ఓటును తొలగించారు. ఇది నాకు ఓ పెద్ద 'జోక్' లాగా అనిపించింది. నాతో పాటు దాదాపు 65 లక్షల మంది ఓటర్ల పేర్లను ఇలాగే తొలగించారు. నేను ఇదే బెంగళూరు నియోజకవర్గంలో పుట్టి, పెరిగాను. నా స్కూలింగ్, కాలేజీ, థియేటర్ అన్నీ ఇక్కడే జరిగాయి. అంతెందుకు.. గతంలో నేను ఇదే నియోజకవర్గం నుంచి ఎంపీగా పోటీ చేశాను'..'అలాంటిది నా ఓటునే ఎలా తొలగిస్తారు ఓటును తిరిగి తెచ్చుకోవడానికి ఇప్పుడు నేను మళ్లీ ఏమేం కాగితాలు చూపించాల్సి వస్తుందో. నా మిత్రమా.. మిమ్మల్ని ఎన్నుకోరని భావించే కొందరు పౌరుల ఓటు హక్కును కాలరాయడానికి మీరు మీ అధికారాన్ని ఉపయోగించవచ్చు. మిమ్మల్ని ఆ సింహాసనం నుంచి కిందకు దించే మా ప్రజల శక్తిని మీరు ఆపగలరా?. జస్ట్ ఆస్కింగ్' అని అన్నారు.

సీడ్ యాక్సిస్ రోడ్ రెడీ...



అమరావతి, ఆగస్టు 11 ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ ప్రక్రియలో ఒక చారిత్రాత్మక ఘట్టానికి ముహూర్తం ఖరారైంది. రాజధాని నగరానికి లైఫ్‌లైన్‌గా చెప్పుకుంటున్న సీడ్ యాక్సిస్ రోడ్డులోని అత్యంత కీలకమైన భాగం ఆగస్టు 13 నుంచి ప్రజలకు అందుబాటులోకి రాబోతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మక రహదారితోపాటు, ప్రజాప్రతినిధుల కోసం నిర్మించిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్సీ టవర్లను కూడా అదే రోజున అధికారికంగా ప్రారంభించనున్నారు. ఈ ప్రారంభోత్సవానికి ఒక రోజు ముందు అంటే 12 ఆగస్టు ముఖ్యమంత్రి కాన్వాయ్‌తో ఈ రహదారిపై అధికారికంగా ట్రయల్ రన్ నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అమరావతి మాస్టర్ ప్లాన్‌లో అత్యంత కీలకమైన ఈ రహదారిని టెక్నికల్‌గా ఇ-3 రోడ్డుఅని పిలుస్తారు. ఇది రాజధాని నగరంలోని ఉత్తరం నుంచి దక్షిణానికి ఉండే 17 ప్రధాన ఎన్ సిరీస్ రోడ్లను ఒకదానితో ఒకటి కలిపే మార్గం. ఈ సీడ్ యాక్సిస్ రోడ్డు మొత్తం పొడవు 21.78కిలోమీటర్లు. ఇది దొండపాడు గ్రామం వద్ద ప్రారంభమై రాయపూడి, వెంకటపాలెం, పెనుమాక, ఉండవల్లి, తాడేపల్లి గ్రామాల మీదుగా సాగి మణిపాల్ ఆసుపత్రి వద్ద జాతీయ రహదారితో కలుస్తుంది. ఈ రోడ్డుకు సంబంధించి రైట్ ఆఫ్ వే 60 మీటర్లుగా నిర్ణయించారు. భవిష్యత్‌లో దీనిని 8 నుంచి 9 లేన్‌ల వరకు విస్తరించేలా ప్రభుత్వం ప్లాన్ చేసింది. ప్రస్తుతం 11 మీటర్ల వెడల్పుతో కూడిన క్యారేజ్ వేస్, సర్వీస్ రోడ్లు, సెంట్రల్ బీఆర్‌టీఎస్ కారిడార్‌తో నిర్మించారు. ఈ భారీ ప్రాజెక్టును అధికారులు మూడు దశలుగా విభజించారు. ఫేజ్-1 పొడవు 14. 35 కిలోమీటర్లు. ఇది దొండపాడు నుంచి వెంకటపాలెం (మంతెన ఆశ్రమం) వరకు ఉంటుంది. ఇది ఇప్పటికే పూర్తి అయ్యి రాకపోకలు సాగుతున్నాయి. రెండోది 3.92 కిలోమీటర్ల పొడవు ఉన్న ఫేజ్ -2. వెంకటపాలెం నుంచి ఉండవల్లి వరకు సాగుతుంది. ఈ భాగమే ఆగస్టు 13న ప్రారంభమవుతుంది. భూసేకరణ సమస్యలు, కోర్టు వ్యాజ్యాలను అధిగమించి ప్రభుత్వం ఈ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసింది. 3.50 కిలోమీటర్ల పొడవు ఉన్న ఫేజ్ -3 ఉండవల్లి నుంచి మణిపాల్ ఆసుపత్రి వరకు నిర్మిస్తున్నారు. ఇందులో ఒక భారీ ఎలివేటెడ్ కారిడార్ 320 మీటర్ల ఐకానిక్ కేబుల్ బ్రిడ్జిని నిర్మించాలని ప్రతిపాదించారు. ఈ రహదారిలో ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నవి ఉండవల్లి వద్ద నిర్మించిన భారీ స్టీల్ బ్రిడ్జ్‌లు. 110 మీటర్ల పొడవుతో బకింగ్‌హామ్ కెనాల్‌పై స్టీల్ బ్రిడ్జి నిర్మించారు. దానిపై తారు పనులు పూర్తి చేశారు. రాజధానికి వరద ముప్పు లేకుండా చేసే కొండవీటి వాగుపై 284మీటర్‌ల పొడవుతో అధునాతన స్టీల్ బ్రిడ్జిని ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతాన్ని కేవలం ఒక రహదారిగానే కాకుండా, ఒక పర్యాటక కేంద్రంగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. కృష్ణానది, కొండవీటి వాగు అందాలను చూసేందుకు ఇక్కడ ప్రత్యేక వ్యూ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నారు. పర్యావరణహితంగా ఉండేందుకు సైక్లింగ్ ట్రాక్‌లు, వాకింగ్ ట్రాక్‌లు, సుందరమైన ల్యాండ్‌స్కేప్ గార్డెన్లను అభివృద్ధి చేస్తున్నారు. విజయవాడ నుంచి అమరావతి సచివాలయానికి హైకోర్టుకు వెళ్లే వేల మంది ఇరుకైన కరకట్ట రహదారిపై ఆధారపడేవారు. ట్రాఫిక్ జామ్‌లు, ప్రమాదకరమైన మలుపులు, గుంతల రోడ్డులతో ప్రయాణం నరకప్రాయంగా ఉండేది. ఈ సీడ్ యాక్సిస్ రోడ్డు అందుబాటులోకి రావడంతో విజయవాడ నుంచి అమరావతికి వెళ్లేందుకు సమయం ఆదా అవుతుంది. దాదాపు అర గంట కలిసి వస్తుంది. నాలుగు లేన్ల రహదారి కావడంతో ప్రమాదాల భయం లేదు. ఈ కారిడార్ వెంబడి ఉన్న ఉండవల్లి, పెనుమాక, మందడం ప్రాంతాల్లో భూముల రేట్లు పెరగనున్నాయి. ఐటీ కంపెనీలు, హోల్స్ రానున్నాయి. ముఖ్యమంత్రి పర్యటన కోసం అమరావతి అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీపార్థసారథి, గుంటూరు కలెక్టర్ సాయికాంత్ వర్మ, ఎస్పీ వకుల్ జిందాల్ ఉండవల్లి స్టీల్ బ్రిడ్జి ప్రాంతాన్ని సందర్శించి ఏర్పాట్లు సమీక్షించారు. ఏర్పాట్లను పర్యవేక్షించారు. అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో చేపట్టిన సీడ్ యాక్సిస్ రోడ్డు ప్రాజెక్టు కోసం మొత్తం 320. 54 ఎకరాల భూమి అవసరమని గుర్తించారు. ఇందులో ఇప్పటికే 278.93 ఎకరాలను సేకరించారు. మిగిలిన భూసేకరణ ప్రక్రియ తుది దశలో ఉంది. ఈ రహదారి కేవలం రవాణా కోసమే కాకుండా రాజధాని నగరంలో గ్యాస్ పైప్‌లైన్లు, వాటర్ మెయిన్స్, ఐసీటీ కారిడార్లు వంటి భూగర్భ వసతుల ఏర్పాటుకు ఉపయోగపడనుంది.

వైసీపీకి బూమ్ రాంగ్ అవుతోందా

విజయవాడ, ఆగస్టు 11రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం, చట్టాలు-పరిపాలనపై క్షుణ్ణమైన అవగాహన ఉన్న ధర్మాన ప్రసాదరావు, బొత్స సత్యనారాయణ వంటి వైఎస్సార్సీపీ సీనియర్ నేతలకు ఏది ప్రజాదరణ పొందే అంశమో, ఏది శూన్యమైన విమర్శో స్పష్టంగా తెలుసు. దశాబ్దాల తరబడి ఎన్నికల రాజకీయాలను ఒంటబట్టించుకున్న ఈ అనుభవజ్ఞులకు.. కనీస ఆధారం లేకుండా ప్రతిపక్షం లేవనెత్తే అంశాలు ప్రతికూలతను పెంచుతాయే తప్ప, ప్రజల నుంచి ఒక్క శాతం కూడా సానుకూలతను తీసుకురావు అనే నిలువెత్తు సత్యం తెలియంది కాదు. అయినా సరే, పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిర్దేశిస్తున్న వ్యూహాలకు తలొగ్గి, తమ సొంత రాజకీయ క్రెడిబిలిటీని బలిపీఠం ఎక్కించేసుకుంటున్నారు.గతంలో ఉమ్మడి ఏపీ కాంగ్రెస్ హయాం నుంచి నేటి వైఎస్సార్సీపీ వరకు సీనియర్ నాయకులుగా చెరగని ముద్ర వేసుకున్న ఈ నేతలు.. జగన్ అనుసరిస్తున్న ఏకపక్ష రాజకీయ శైలి వల్ల సమాజంలో తమ ఆత్మగౌరవాన్ని కోల్పోతున్నారనే చర్చ నడుస్తోంది. డీఎస్సీ వంటి నిరుద్యోగ సున్నిత అంశాలపై ఎటువంటి డాక్యుమెంటరీ ఆధారాలు లేకపోయినా, కోర్టుల్లో విచారణకు కూడా నిలబడే సాక్ష్యాలు చూపించలేకపోయినా.. జగన్ మైక్ ముందు చెప్పిన ప్రతిపాయింట్‌నూ కిందిస్థాయిలో బలవంతంగా మోయాల్సి రావడం వారి రాజకీయ అనుభవానికే అవమానకరంగా మారింది. ఆధారం లేని పోరాటం వల్ల ఎంపికైన 16,000 మందికి పైగా ఉపాధ్యాయులు, వారి కుటుంబాల ఆగ్రహానికి గురికావాల్సి వస్తోంది.తన స్వయంకృతాపరాధ నిర్ణయాలతో స్వయంగా నెత్తిపై చేయి పెట్టుకునే భస్మాసుర రాజకీయాన్ని జగన్ నడుపుతుంటే, సీనియర్లు తెలిసీ తెలియక అందులో భాగస్వాములు అవుతున్నారనేది నిగ్గు తేలిన నిజం. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కూడా సజ్జల రామకృష్ణారెడ్డి నెట్‌వర్క్ చెప్పినట్లే వినాల్సి వచ్చిందని, ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నా సరే అదే తీరు కొనసాగుతోందని అంతర్గత మధనం వ్యక్తమవుతోంది. దశాబ్దాలుగా ప్రజాక్షేత్రంలో సంపాదించుకున్న గుర్తింపును, ఇమేజ్‌ను ఒకే వ్యక్తి రాజకీయ ఆధిపత్యం, వ్యర్థ రాజకీయ ఎజెండాల కోసం ధారపోయడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నకు వారి వద్ద సమాధానం లేదు.ఇంత బతుకు బతికి సొంత రాజకీయాన్ని, స్వయంప్రతిపత్తిని పక్కనబెట్టి జగన్ రెడ్డి వద్ద ఈ రకంగా డీలా పడిపోవడానికి వారి మనసు ఎలా ఒప్పుతుందోగానీ, ఈ ధోరణి ఇలాగే కొనసాగితే వారి రాజకీయ జీవితాలకు ఇది తీవ్రమైన నష్టం చేకూరుస్తుంది. అధినేత చెప్పే తప్పుడు కథనాలకు మద్దతుగా ప్రెస్ మీట్లు పెట్టడం ఆపి, ఇప్పటికైనా తమ రాజకీయ వ్యూహాలను సమీక్షించుకోవాల్సిన తక్షణం ఆసన్నమైంది. సమాజంలో తమకున్న గౌరవాన్ని కాపాడుకోవడానికైనా లేదా ప్రత్యామ్నాయ రాజకీయ దారులు చూసుకోవడానికైనా ఈ సీనియర్ నాయకులు మౌనం వీడాల్సిన అవసరం ఉంది.ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా, రికార్డు స్థాయిలో 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్వహించిన మెగా డీఎస్సీపై ప్రతిపక్షం ఆది నుంచి ఆరోపణలు గుప్పిస్తూనే ఉంది. అయితే ఆ ఆరోపణల్లో ఒక్కటంటే ఒక్క బలమైన చట్టబద్ధమైన ఆధారాన్ని కూడా వైసీపీ బయటపెట్టలేకపోయింది. సాంకేతిక అవకతవకలు, అక్రమాలు జరిగాయని ఎన్ని కథనాలు అల్లినా, నిరుద్యోగులు గానీ, పరీక్ష రాసిన వేలాది మంది అభ్యర్థులు గానీ వాటిని నమ్మే పరిస్థితి లేదు. న్యాయస్థానాలను ఆశ్రయించి పక్కా సాక్ష్యాధారాలతో సీబీఐ విచారణ కోరడంలో ఆ పార్టీ తరఫు నేతలు ఘోరంగా విఫలమయ్యారు. కోర్టుల్లో నిలబడని, ఆధారాలు సమర్పించలేని కథనాలతో వీధుల్లో రచ్చ చేయడం వల్ల ఆ పార్టీ చేస్తున్నది ప్రజాపోరాటం కాదని, కేవలం ఒక కుట్రపూరిత తప్పుడు రాజకీయం అని సామాన్య ప్రజలకు సైతం అర్థమైపోయింది.అన్నింటికంటే ముఖ్యంగా, ఈ ఉనికి లేని వివాదం వల్ల వైఎస్సార్సీపీ సమాజంలో తీవ్ర ప్రతికూలతను మూటగట్టుకుంటోంది. మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన దాదాపు 16,347 మంది ఉపాధ్యాయులు, వారి వెనుకున్న వేలాది కుటుంబాలు ఇప్పుడు ప్రతిపక్ష వైఖరిపై తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్నాయి. దశాబ్దాల కష్టంతో, పారదర్శకమైన పోటీలో తమ ప్రతిభతో ఉద్యోగాలు సాధిస్తే, తమ అర్హతలను, ఆత్మగౌరవాన్ని పదేపదే శంకిస్తూ పొలిటికల్ మైలేజ్ కోసం వాడుకోవడాన్ని ఆ ఉపాధ్యాయ లోకం సహించలేకపోతోంది. రాయలసీమ నుంచి మొదలై కోస్తాంధ్ర వరకు ఈ ఉద్యోగ విజేతలు ఉపాధ్యాయ ఆత్మగౌరవ ర్యాలీలు నిర్వహిస్తూ ప్రతిపక్ష వైఖరిని ఎండగడుతున్నారు.ప్రజాబలం తోడుకాకపోగా, యువత నుంచి మద్దతు లభించకపోగా, పైగా ఎంపికైన 16 వేలకు పైగా కుటుంబాల నుంచి తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకోవడం రాజకీయంగా ఎంత పెద్ద వ్యూహాత్మక తప్పిదమో స్పష్టమవుతోంది. రాలగొట్టుకోవడానికి ఏ రాయి అయితే ఏమిటి అన్నట్లుగా ఆలోచన లేకుండా ఒక ప్రతికూల అంశాన్ని పదేపదే పట్టుకుని వేలాడటం వల్ల వైసీపీకి లభించే రాజకీయ లబ్ధి సున్నా సరేకదా, ఉన్న అరకొర క్రెడిబిలిటీని కూడా నట్టేట ముంచేస్తోంది. ప్రజామోదం లేని ఇటువంటి వ్యర్థ పోరాటాల వల్ల ప్రభుత్వంపై ఎలాంటి ఒత్తిడి పడకపోగా, ప్రతిపక్షం తన సొంత ఓటు బ్యాంకునే మరింత దూర చేసుకుంటోందనేది అసలు నిజం

డీఎస్సీపై ఒంటరి పోరు

గుంటూరు, ఆగస్టు 11 వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ డీఎస్సీ 2025 పై ఉద్యమం చేపడుతోంది. అయితే ఈ ఉద్యమం విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏం ఆశిస్తుందో తెలియడం లేదు కానీ.. ప్రజల్లోకి ఈ అంశం వెళ్లడం లేదు. పైగా కొన్ని వర్గాలు వ్యతిరేకిస్తున్నాయి. సమాజంలో అస్థిరతను, గందరగోళాన్ని సృష్టించేందుకే డీఎస్సీ పై విష ప్రచారం చేస్తున్నారు అంటూ కొంతమంది మండిపడుతున్నారు. కూటమి ప్రభుత్వాన్ని వ్యతిరేకించే న్యాయవాది జడ శ్రావణ్ కుమార్ సైతం ఈ విషయంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తీరును తప్పుపట్టారు. ఇప్పుడు జాతీయ పార్టీ కాంగ్రెస్ సైతం దీనిని తీవ్రంగా తప్పుపడుతోంది. వేలాదిమంది ఉపాధ్యాయుల్లో అశాంతి నింపడమే అవుతుందని తేల్చి చెబుతోంది. ప్రజా సమస్యలు గాలికి వదిలి డీఎస్సీ 2025 పై విషం చిమ్మడంపై తీవ్రస్థాయిలో ఆక్షేపిస్తోంది. కేంద్ర మాజీమంత్రి చింతామోహన్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి మరి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతోపాటు జగన్మోహన్ రెడ్డి తీరుపై మండిపడ్డారు. ఇంత జరిగాక కూడా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వెనక్కి తగ్గకపోవడం ఆందోళన కలిగిస్తోంది.సమకాలీన అంశాలపై ఎప్పటికప్పుడు స్పందిస్తుంటారు కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్. తాజాగా రాష్ట్ర వ్యాప్తంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ డీఎస్సీ పై ఆందోళనలు చేస్తున్న సంగతి తెలిసిందే. అదే సమయంలో వేలాది మంది ఉపాధ్యాయులు కర్నూలు కొండారెడ్డి బురుజు సెంటర్ పై ఆత్మగౌరవం పేరుతో నిరసన చేపట్టారు. ఈ క్రమంలో రాయలసీమ వాసిగా.. బాధ్యతాయుతమైన కేంద్ర మాజీ మంత్రిగా స్పందించారు చింతా మోహన్. అసలు డీఎస్సీ పై ఉద్యమం ఎందుకు చేయాల్సి వచ్చిందని ప్రశ్నించారు. ఒక్క అక్రమం కూడా జరగలేదని తనకు తెలుసు అని.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆరోపణ చేసినప్పుడు తాను దీనిపై లోతైన శోధన చేశానన్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రజల్లో అయోమయం సృష్టిస్తామంటే కుదిరే పని కాదని తేల్చి చెప్పారు.అయితే ఒక్క మాట మాత్రం నిజం. ఏపీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలను దూరం చేసుకుంటుంది. ప్రస్తుతం ఉపాధ్యాయ వర్గాన్ని దూరం చేసుకుంది. ఇంకోవైపు తనతో కలిసివచ్చే రాజకీయ పక్షాలు లేకుండా చేసుకుంటుంది. చింతా మోహన్ కేంద్ర మాజీ మంత్రి హోదాలో.. కాంగ్రెస్ పార్టీకి వీర విధేయుడు హోదాలో మాట్లాడుతారు.

నిందితులకే మద్దతా...

నిన్న అప్పలరాజు... ఇవాళ పాస్టర్ కోడుకు

రాజమండ్రి, ఆగస్టు 11 రాజమండ్రిలో డాక్టర్ ప్రియాంకపై కారు ఎక్కించి దారుణంగా హత్య చేసిన ఉదంతం రాజకీయంగా, సామాజికంగా తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ కేసులో ప్రధాన నిందితుల్లో ఒకరైన ఆంద్రూ జోసెఫ్ ఎడ్వర్డ్స్ ప్రసిద్ధ పాస్టర్ కుమారుడు కావడంతో, ఈ వ్యవహారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి, ముఖ్యంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి తీవ్రమైన సంకట పరిస్థితిని తెచ్చిపెట్టింది. ఒకవైపు నిందితుడు తమకు అత్యంత కీలకమైన ఓటు బ్యాంక్ వర్గానికి చెందిన కుటుంబ నేపథ్యం కలవాడు కావడం, మరొకవైపు అత్యంత కిరాతకానికి గురైన బాధితురాలు వైద్య విద్యార్థిని కావడం వల్ల.. ఈ కేసులో ఎటువైపు నిలబడాలో తెలియక వైసీపీ రాజకీయ డైలమాలో పడింది. ఈ విమర్శలు రావడంతో చివరికి జగన్ ప్రభుత్వాన్ని నిందిస్తూ ఓ ట్వీట్ చేసి పడేశారు.ఇటీవల కాశిబుగ్గ సమీపంలో మాజీ మంత్రి, వైసీపీ నేత సీదిరి అప్పలరాజు కుమారుడు ఆరవ్ వర్మ జరిపిన హిట్ అండ్ రన్ కేసులో ఒక పేద గొర్రెల కాపరి దానయ్య ప్రాణాలు కోల్పోతే, వైసీపీ అనుసరించిన వైఖరి పైనే ఇప్పుడు ప్రధాన చర్చ జరుగుతోంది. ఆ కేసులో సొంత పార్టీ నేత కుమారుడిని రక్షించేందుకు వేరొక అనామకుడిపై నింద మోపే ప్రయత్నం చేశారు. దానయ్యను కాపాడే ప్రయత్నం చేయలేదు. దానయ్య కుటుంబాన్ని ఆదుకోలేదు. తప్పుడు కుట్రలు చేసినందుకు సీదిరి అప్పలరాజుపై కేసు నమోదు చేస్తే దాన్ని రాజకీయ కక్ష సాధింపు గా జగన్ రెడ్డి వర్గీకరించడం తీవ్ర విమర్శలకు దారితీసింది. బాధితుడైన గొర్రెల కాపరి కుటుంబం ఆవేదనను పక్కనపెట్టి, కేవలం తమ పార్టీ నేత, కుల సమీకరణాలకే జగన్ ప్రాధాన్యత ఇచ్చారు. మత్స్యకార నాయకుడ్ని వేధిస్తున్నట్లుగా ప్రచారం చేశారు.ఇదే ప్రాతిపదికన విశ్లేషిస్తే, ఇప్పుడు రాజమండ్రి కేసులో కూడా వైసీపీ అదే తరహా సొంత వర్గ రక్షణ వ్యూహాన్ని అమలు చేస్తుందా అనే ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. జోసెఫ్ ఎడ్వర్డ్స్ కుటుంబం సామాజికంగా, మతపరంగా వైసీపీకి సాంప్రదాయకంగా మద్దతు ఇచ్చే వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తోంది. ఇప్పుడు గనుక రాజమండ్రి కేసులో నిందితులకు కఠిన శిక్ష పడాలని, వారిపై ఉద్దేశపూర్వక హత్య సెక్షన్లు సమర్థనీయమేనని వైసీపీ డిమాండ్ చేస్తోంది పైపైకే. ఎందుకంటే ప్రజాగ్రహం ఎక్కువగా ఉంది కాబట్టి ఇలా ప్రియాంక కోసం మాట్లాడుతున్నారు. మరి కాశిబుగ్గ కేసులో అప్పలరాజు కొడుకుపై చట్టం చర్యలు తీసుకున్నప్పుడు ఎందుకు వ్యతిరేకించారు? అక్కడ లేని న్యాయసూత్రాలు ఇక్కడ మాత్రమే గుర్తుకొచ్చాయా?అంతేకాకుండా, ప్రియాంక తండ్రి కడుపుకోతతో మాట్లాడుతున్న మాటలను సైతం రాజకీయంగా వక్రీకరిస్తున్నారు. చట్టం ముందు అందరూ సమానులే అయినప్పుడు, ఒక నిందితుడు తమ పార్టీ నేత కొడుకైనా, లేక ఓటు బ్యాంకుకు చెందిన ప్రముఖుడి కొడుకైనా శిక్ష ఒకేలా ఉండాలన్న కనీస ధర్మాన్ని వైసీపీ విస్మరిస్తోంది. బాధితురాలైన డాక్టర్ ప్రియాంక కుటుంబానికి న్యాయం జరగాలనే డిమాండ్ ఏపీవ్యాప్తంగా మిన్నంటుతున్న వేళ, వైసీపీ ద్వంద్వ వైఖరి ఆ పార్టీ విశ్వసనీయతను మరింత దిగజారుస్తోంది. సీదిరి అప్పలరాజు కేసులో బాధితుడికి ఒక న్యాయం, రాజమండ్రి కేసులో మరో న్యాయం అన్నట్లుగా రాజకీయాలు చేస్తున్నారు

ఏపీలో కుటుంబ రాజకీయాలు..సమీకరణలు!

విజయవాడ, ఆగస్టు 11 వైయస్ రాజశేఖర్ రెడ్డి అకాల మరణంతో కాంగ్రెస్ పార్టీ నుంచి బయటికి వచ్చారు జగన్మోహన్ రెడ్డి. రాజశేఖర్ రెడ్డి రాజకీయ వారసత్వంగా ముఖ్యమంత్రి పదవి కోరుకుంది ఆ ఫ్యామిలీ. అందుకు పార్టీ హై కమాండ్ అంగీకరించకపోవడంతో జగన్మోహన్ రెడ్డి పార్టీకి రాజీనామా చేశారు. కేసుల రూపంలో సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొన్నారు. ఆ సమయంలో ఫ్యామిలీ మొత్తం జగన్మోహన్ రెడ్డికి అండగా నిలబడింది.. ఆ ఫ్యామిలీ మద్దతుతోనే పార్టీని ఏర్పాటు చేశారు. తొలి ఎన్నికల్లో అధికార పార్టీకి ధీటుగా సీట్లు తెచ్చుకున్నారు. 2019 ఎన్నికల్లో ఘనవిజయం సాధించారు. తల్లి విజయలక్ష్మి, చెల్లెలు షర్మిల, బాబాయ్ వివేకానంద రెడ్డి, సోదరులు అవినాష్ రెడ్డి, మేనమామ రవీంద్రనాథ్ రెడ్డి.. ఇలా చెప్పుకుంటే ఆ ఫ్యామిలీ మొత్తం జగన్మోహన్ రెడ్డికి అండగా నిలబడింది. అయితే అదే సమయంలో టిడిపిలో చూస్తే మాత్రం చంద్రబాబుతో పాటు లోకేష్ కు సొంత కుటుంబం దన్ను అంతగా లేకపోయింది. కానీ ఇప్పుడు జగన్ కు ఫ్యామిలీ అండ తగ్గింది. చంద్రబాబుకు గణనీయంగా పెరుగుతూ వస్తోంది.తెలుగుదేశం అధినేత చంద్రబాబు విషయంలో కుటుంబ పరంగా ఒక భిన్న వాతావరణం ఉండేది. నందమూరి హరికృష్ణ అండగా నిలిచేవారు. కానీ అదే సమయంలో రెబల్గా కూడా వ్యవహరించేవారు. ఎప్పుడు ఎలా ఉండేవారో తెలియంది కాదు. మరోవైపు తోడల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు, పురందేశ్వరి దంపతులు సైతం వ్యతిరేకంగా ఉండేవారు. చంద్రబాబు రాజకీయ ప్రత్యర్థులతో చేతులు కలిపారు. మరోవైపు సమీప బంధువు, జూనియర్ ఎన్టీఆర్ మామ నార్నియా శ్రీనివాసరావు సైతం చంద్రబాబుకు పూర్తిగా వ్యతిరేకంగా మారిపోయారు. ఇలా సొంత కుటుంబ సభ్యులే చికాకుల మీద చికాకులు తెచ్చి పెట్టేవారు. మరోవైపు లోకేష్ ఆశించిన స్థాయిలో పట్టు పెంచుకోలేదు అప్పట్లో.అయితే కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు. ఎవరు మనసులో ఏముంటుందో కూడా చెప్పలేము. అప్పుడు జగన్ కు ఫ్యామిలీ అండగా నిలబడగా.. ఇప్పుడు అదే ఫ్యామిలీ వ్యతిరేకంగా మారిపోయింది. మొదట చెల్లెలు షర్మిల దూరమయ్యారు. ఆమెకు అండగా నిలిచేందుకు జగన్మోహన్ రెడ్డికి దూరమయ్యారు తల్లి విజయమ్మ. బాబాయ్ వివేకానంద రెడ్డి హత్య కేసుతో కుటుంబం అంతా అడ్డగోలుగా చీలిపోయింది. మరో చెల్లెలు సునీత పూర్తిగా ప్రత్యర్థిగా మారిపోయారు. ఇప్పుడు కేవలం జగన్మోహన్ రెడ్డి వెంట కుటుంబంలో నిలిచేది అవినాష్ రెడ్డి, ఆయన ఫ్యామిలీ. మిగతా వారంతా దూరమైనట్టే. కేవలం దూరం మాత్రమే కాదు రాజకీయంగా విభేదించడం కూడా మొదలుపెట్టారు. మొన్నటి ఎన్నికల్లో ప్రభావం కూడా చూపారు..అయితే ఇప్పుడు చంద్రబాబు విషయానికి వద్దాం. నందమూరి ఫ్యామిలీ పూర్తిగా ఆయనకు అండగా నిలుస్తోంది. జూనియర్ ఎన్టీఆర్ సైతం మౌనం వహించక తప్పడం లేదు. తోడల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు, పురందేశ్వరి దంపతులు సైతం రాజీ పడ్డారు. మొన్నటి ఎన్నికల్లో బిజెపితో తెలుగుదేశం పొత్తుకు పురందేశ్వరి ఒక కారణం. ప్రస్తుతం వారి కుమారుడు సైతం నారా లోకేష్ తో పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇంకోవైపు నారా రోహిత్ అంటే చంద్రబాబు తమ్ముడి కుమారుడు సైతం లోకేష్ తో కలిసి పని చేస్తున్నారు. ఇంకో వైపు లోకేష్ తోడల్లుడు, నందమూరి బాలకృష్ణ చిన్న అల్లుడు శ్రీ భరత్ సైతం పార్టీకి అండదండగా నిలుస్తూ వచ్చారు.. ఇలా చెప్పుకుంటే ఫ్యామిలీలు ఇప్పుడు అంతా ఒక్కటై చంద్రబాబుకు అండగా నిలబడుతున్నాయి. జగన్మోహన్ రెడ్డితో పోల్చుకుంటే చంద్రబాబుకు ఇప్పుడు ఫ్యామిలీ బలం అదనం.

సునీత ఒంటరి పోరాటం...

కడప, ఆగస్టు 11 మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి దారుణ హత్య కేసులో ఆయన కుమార్తె డాక్టర్ వైఎస్ సునీతారెడ్డి ఎన్నో ఏళ్లుగా వేస్తున్న అత్యంత ప్రాథమిక, కీలకమైన ప్రశ్న ఇదే. ఈ విషయం సీబీఐ అఫిడవిట్‌లోనే ఉంది. బయట ప్రపంచానికి, కనీసం ఇంట్లో పనిచేసే సిబ్బందికి కూడా తెలియక ముందే వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి హత్య విషయం ఎలా తెలిసింది? ఈ ఒక్క ప్రశ్నకు చట్టబద్ధంగా విచారణ సంస్థలు సమాధానం కనుగొంటే, హత్య వెనుక ఉన్న అసలు సూత్రధారులు, పాత్రధారులు బయటపడతారని సునీత బలంగా నమ్ముతున్నారు. తెలంగాణ హైకోర్టులో సీబీఐ దాఖలు చేసిన అదనపు అఫిడవిట్‌లో సైతం మార్చి 15, 2019 ఉదయం 6:15 గంటలకు వివేకా పీఏ కృష్ణారెడ్డి ద్వారా వార్త బయటకు రావడానికి ముందే జగన్‌కు ఈ విషయం తెలుసని పేర్కొనడం ఈ అనుమానాలకు మరింత బలాన్ని చేకూర్చింది.న్యాయస్థానాల్లో ప్రతిపక్ష డిఫెన్స్ లాయర్లు దీనిపై వాదిస్తూ.. కుటుంబ సభ్యులు, బంధువుల మధ్య సమాచారం త్వరగా మార్పిడి కావడం సహజమేనని, దాంట్లో నేరపూరిత కోణం ఏమీ లేదని సరిపెట్టుకునే యత్నం చేశారు. అయితే ఇక్కడే అసలు రాజ్యాంగ, న్యాయపరమైన లోపం స్పష్టమవుతోంది. బంధువులకు సమాచారం అందింది అనే సాధారణ సాకుతో వార్త ఎక్కడి నుంచి వచ్చిందో విచారించకుండా విస్మరించడం సమంజసం కాదనేదిసునీత వాదన. హత్య జరిగిన అర్ధరాత్రి దాటిన సమయం నుంచి ఉదయం వరకు కడప ఎంపీ అవినాష్ రెడ్డి ఫోన్ నుంచి నడిచిన వాట్సాప్, వాయిస్ కాల్స్ ఐపీడీఆర్ డేటాను సీబీఐ అఫిడవిట్‌లోప్రస్తావించినప్పటికీ, ఆ సమాచారం కనెక్షన్ చివరగా ఎక్కడ ముగిసిందో పూర్తి స్థాయిలో మనీ-పవర్ ట్రయల్‌తో ముడిపెట్టి తేల్చకపోవడమే అసలు వివాదం.న్యాయం కోసం సునీత పడుతున్న తపన, సాగిస్తున్న పోరాటం సాధారణమైంది కాదు. కింది కోర్టుల నుంచి సుప్రీంకోర్టు వరకు, ఏపీ నుంచి విచారణను తెలంగాణకు బదిలీ చేయించడం వరకు ఆమె అలుపెరగకుండా పోరాడుతున్నారు. హత్య వెనుక ఎవరున్నారనేది ప్రజలందరికీ ఒక అంచనా ఉన్నప్పటికీ.. దానిని చట్టబద్ధమైన సాక్ష్యాధారాలతో కోర్టు ముందు రుజువు చేసి, నిందితులకు శిక్ష పడేలా చేయడమే ఆమె అంతిమ లక్ష్యం. ఏడేళ్లు గడిచినా ఒక మాజీ ఎంపీ కుమార్తె న్యాయం కోసం వ్యవస్థల చుట్టూ తిరగాల్సి రావడం భారతీయ నేర విచారణ వ్యవస్థ లోని మందగమనానికి అద్దం పడుతోంది.ఈ తరుణంలోనే సునీత నేరుగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాసి, కేసులోని పెద్ద కుట్ర కోణాన్ని, ముందస్తు సమాచారం ఎవరికి ఎలా చేరిందనే అంశాన్ని త్వరితగతిన తేల్చాలని విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగబద్ధ అత్యున్నత పీఠం జోక్యం చేసుకుని సీబీఐ దర్యాప్తునకు స్పష్టమైన కాలపరిమితిని, దిశానిర్దేశాన్ని ఇస్తే తప్ప ఈ కేసు ముడిపడేలా లేదు. ఒక కుటుంబం తమ ఆత్మీయుడిని కోల్పోయి, వ్యవస్థలు సహకరిస్తాయో లేదోనన్న ఆందోళనతో సాగిస్తున్న ఈ ఆత్మగౌరవ పోరాటానికి చట్టం నిజమైన న్యాయం చేస్తుందా లేదా అనేది కాలమే నిర్ణయించాలి.



స్పోర్ట్స్ న్యూస్

ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్: పావురాలు.. కోతుల బెడదకు చెక్ పెట్టేలా.. !



భారత్ వేదికగా జరగనున్న ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ కోసం నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆగస్టు 17 నుంచి 23 వరకు ఢిల్లీలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఈ పోటీలు జరగనున్నాయి. ఈ ఏడాది జనవరిలో జరిగిన ఇండియా ఓపెన్‌లో పావురాల కారణంగా మ్యాచ్‌కు రెండుసార్లు అంతరాయం ఏర్పడటంతో.. ఈసారి అలాంటి పరిస్థితులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. స్టేడియంలోని వెంట్లను మూసివేయడంతో పాటు చెక్క తలుపుల స్థానంలో డబుల్ డోర్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. పక్షులు లోపలికి రాకుండా అమెరికా నుంచి తెప్పించిన విష రహిత జెల్‌ను ఉపయోగిస్తున్నారు. అలాగే వేట పక్షుల అరుపులను అనుకరించే ప్రత్యేక యంత్రాలను కూడా ఏర్పాటు చేశారు. కోతులు, వీధి కుక్కల బెడదను నివారించేందుకు ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌తో అధికారులు సమన్వయం చేస్తున్నారు.స్టేడియం పైకప్పు మరమ్మతులతో పాటు లీకేజీలను సరిచేశారు. పలు ఎక్స్‌పాన్షన్ జాయింట్లకు మరమ్మతులు చేశారు. కొత్త కుర్చీలు ఏర్పాటు చేయడంతో పాటు పాతవాటికి పాలిష్ చేసి భవనాలకు రంగులు వేశారు. స్టేడియం ఎదురుగా ఉన్న సరస్సును సైతం అభివృద్ధి చేస్తున్నారు. అయితే ఈ ఏర్పాట్లపై భారత స్టార్ షట్లర్ పీవీ సింధు ఎక్స్ వేదికగా స్పందించింది.'ఈ పరిష్కారం వెంటే నవ్వు రావొచ్చు. కానీ చేస్తున్న ప్రయత్నాన్ని మాత్రం మెచ్చుకోవాలి. ప్రపంచాన్ని ఆహ్వానించేందుకు ఎంతోమంది తెర వెనుక పనిచేస్తున్నారు. మా పరిష్కారాలన్నీ సంప్రదాయబద్ధమైనవి. మా ఆతిథ్యం, స్ఫూర్తి కూడా అంతే ప్రత్యేకం' అంటూ ఎక్స్‌లో పోస్టు చేసింది. ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) కూడా స్టేడియంలో చేపట్టిన ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేసినట్లు అధికారులు తెలిపారు.

మిమ్మల్ని చంపేస్తాం.. గంగూలీ దంపతులకు బెదిరింపు లేఖలు!



భారత మాజీ కెప్టెన్, బెంగాల్ క్రికెట్ సంఘం అధ్యక్షుడు సౌరభ్ గంగూలీ, ఆయన భార్య డోనాకు బెదిరింపులు రావడం కలకలం రేపింది. గత ఆరు నెలలుగా గంగూలీ పేరుతో పలు బెదిరింపు లేఖలు వచ్చినట్లు తెలుస్తోంది. తొలుత వాటిని పెద్దగా పట్టించుకోకపోయినా.. సోమవారం కార్యాలయానికి వచ్చిన రెండు లేఖల్లో గంగూలీ దంపతులను హతమారుస్తామంటూ హెచ్చరికలు ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.గంగూలీ మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దక్షిణ కోల్‌కతాలోని ఠాకుర్‌పుకూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. బెదిరింపు లేఖలు కొరియర్ ద్వారా వచ్చినట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని బెల్ఘరియాకు చెందిన వ్యక్తి ఈ లేఖలు పంపినట్లు అనుమానిస్తున్నారు. కొరియర్ సంస్థ నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు.. లేఖలతో సంబంధం ఉన్న మొబైల్ నంబర్, సిమ్ కార్డు కదలికలపై ఆరా తీస్తున్నారు. అన్ని లేఖల వెనుక ఒకే వ్యక్తి ఉన్నాడా? బెదిరింపులకు కారణమేంటి? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది.

జాంబీ డ్రగ్స్‌కు బానిసవుతున్న పంజాబ్..

ఎంపీ హర్భజన్ వీడియోపై వివాదం



న్యూఢిల్లీ: బీజేపీ రాజ్యసభ ఎంపీ, మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్.. తన సోషల్ మీడియా ఎక్స్ అకౌంట్‌లో షేర్ చేసిన ఓ వీడియో ఇప్పుడు తీవ్ర వివాదాన్ని సృష్టిస్తున్నది. పంజాబీ యువత డ్రగ్స్ బానిసై.. జాంబీలుగా మారిపోతున్నట్లు తన వీడియోలో ఎంపీ హర్భజన్ ఆరోపించారు. ఇటీవల బీజేపీలో చేరిన హర్భజన్.. పంజాబ్ సర్కారు తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. తలపాగా కట్టుకున్న ఇద్దరు వ్యక్తులు జాంబీల తరహాలో నిలబడి ఉన్న వీడియోను టర్బనేటర్ తన ఎక్స్‌లో షేర్ చేశారు. పంజాబ్‌ను ఎలా మార్చారో చూడండి అంటూ ఆయన కామెంట్ చేశారు. తన పంజాబ్‌పై చెడు దృష్టి పడిందని ఆరోపించారు. పంజాబ్‌ను, పంజాబీ యువతను ప్రభుత్వాలు నిర్వీర్యం చేసినట్లు హర్భజన్ ఆరోపించారు. ఈ వీడియోకు మిలియన్ల సంఖ్యలో వ్యూవ్స్ వచ్చాయి. జాంగీ డ్రగ్‌గా పిలువబడే గ్లైలజైన్ డ్రగ్ తీసుకోవడం వల్ల ఆ వ్యక్తులు అలా మారినట్లు తెలుస్తోంది.ఎంపీ హర్భజన్ పోస్టు చేసిన వీడియోపై విమర్శలు వస్తున్నాయి. ఆ వీడియోను పంజాబ్‌లో షూట్ చేయలేదని ఆప్ నేత , పంజాబ్ ఆర్థిక మంత్రి హర్పాల్ సింగ్ చీమా ఆరోపించారు. బీజేపీ పంజాబ్ సర్కారును అపఖ్యాతికి గురి చేస్తున్నదని పేర్కొన్నారు. రాజస్థాన్‌లో తీసిన వీడియోకు పంజాబ్ అని చెప్పి తప్పుదోవ పట్టిస్తున్నట్లు ఆయన తెలిపారు. గుజరాతీ పోర్టుల్లో భారీ స్థాయిలో డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకుంటున్నారని, అక్కడ నుంచి ఆ డ్రగ్స్ పంజాబ్‌కు వస్తున్నట్లు చీమా ఆరోపించారు. తాజా భజ్జీ పోస్టు చేసిన వీడియోను రాజస్థాన్‌లోని శ్రీ గంగానగర్ జిల్లాలో షూట్ చేసినట్లు తెలుస్తోంది.

అత్యాచారం కేసులో ఐపీఎల్ స్టార్ అరెస్ట్..!

ఇండియన్ ప్రీమియర్ లీగ్ స్టార్ అభిషేక్ పొరెల్ అరెస్టయ్యాడు. అత్యాచారం కేసులో అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఓ వైద్య విద్యార్థిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు అభిషేక్‌పై క్రిమినల్ కేసు పెట్టిన పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి తనను లైంగికంగా లొంగదీసుకున్నాడని సదరు విద్యార్థిని అతడిపై తీవ్రమైన ఆరోపణలు చేసింది.ఐపీఎల్‌లో మెరుస్తున్న మరో క్రికెటర్ అత్యాచారం కేసులో అరెస్టయ్యాడు. ఇప్పటికే యశ్ దయాల్ రేప్ కేసులో ఇరుక్కోగా.. బెంగాల్ క్రికెటరైన అభిషేక్ పొరెల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు ప్రాతినిధ్యం వహించే అభిషేక్ తనపై అత్యాచారం చేశాడని, భయపెట్టాడని ఓ వైద్య విద్యార్థిని ఫిర్యాదు చేయడమే అందుకు కారణం. సదరు విద్యార్థిని ఫిర్యాదు మేరకు డుమ్ డుమ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎమామి సిటీ పోలీసులు అభిషేక్‌ను అరెస్ట్ చేశారు.హుగ్లీ రూరల్ పోలీస్ ఎస్పీ కున్వర్ భుషణ్ సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. బాధితురాలు జూన్‌లో అభిషేక్‌పై ఫిర్యాదు చేసింది. 'గత మూడేళ్లుగా మేము రిలేషన్‌షిప్‌లో ఉన్నాం. నన్ను పెళ్లి చేసుకుంటానని అభిషేక్ నమ్మబలికాడు. నన్ను లైంగికంగా వాడుకున్నాడు. అయితే.. పెళ్లి ప్రస్తావన తీసుకురాగా.. ముఖం చాటేశాడు. దాదాపు ఏడాది కాలంగా అతడు నన్ను దూరం పెడుతున్నాడు. పెళ్లి చేసుకోవాలని అడిగితే నన్ను బెదిరించాడు' అని వైద్య విద్యార్థిని ఫిర్యాదు చేసింది.తనకు న్యాయం చేయాలని ఆమె కోర్టును కూడా ఆశ్రయించింది. దాంతో, కోల్‌కతా హైకోర్టు క్రికెటర్ అభిషేక్‌ను అరెస్ట్ చేయాలని ఆదేశాలిచ్చింది. అయితే.. అభిషేక్ మాత్రం తనకేం తెలియదని, ఆ అమ్మాయి చెబుతున్నదంతా కట్టు కథ అని కొట్టిపారేశాడు.



ఫీల్డింగ్‌లో కోహ్లీ ఎనర్జీ వేరే లెవల్.. ఇప్పటికీ టీమిండియాపై ఆ ప్రభావం: టి.దిలీప్



భారత స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీపై మాజీ ఫీల్డింగ్ కోచ్ టి.దిలీప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. అతడు ఫీల్డింగ్‌లో చూపించే ఎనర్జీ అద్భుతమని కొనియాడాడు. విరాట్ ప్రభావం జట్టులోని మిగతా ప్లేయర్లపైనా పడుతుందని వెల్లడించాడు. ప్రాక్టీస్‌లో చూపించే ఉత్సాహాన్నే.. మ్యాచ్‌లోనూ ప్రదర్శిస్తాడని తెలిపాడు. ఈ క్రమంలో విరాట్ కోహ్లీ ఫీల్డింగ్ గురించి దిలీప్ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు.'విరాట్ కోహ్లీ విషయానికి వస్తే.. ఫీల్డింగ్ విషయంలో రాజీ పడడు. పవర్ ప్లేలో కవర్స్, షార్ట్ మిడ్ వికెట్ వంటి స్థానాల్లో అతడి రిఫ్లెక్సులు, డైవ్స్, బంతిని ఆపే విధానం అద్భుతంగా ఉంటుంది. బంతి తన వైపు రానప్పుడు కూడా అతడి ఫీల్డింగ్ ప్రయత్నాలు ఆగవు. నాన్‌స్ట్రైకర్ వైపు పరుగెత్తి త్రో అందుకుని వికెట్ కీపర్‌కు బంతిని అందిస్తుంటాడు. విరాట్ ఇప్పటికే టెస్టు, టీ20లకు వీడ్కోలు చెప్పేశాడు. కెరీర్‌లో ఈ దశలోనూ చివరి ఓవర్లలో లాంగ్ ఆన్‌లో ఫీల్డింగ్ చేస్తాడు. అక్కడి నుంచి పరుగెత్తుకొస్తాడు. అతడి తీవ్రత పక్కనున్న వారికీ అంటుకుంటుంది. విరాట్ ప్రాక్టీస్‌లో ఎలా ఉంటాడో.. మ్యాచ్‌లోనూ అలాగే ఉంటాడు. అతడితో కలిసి ఫీల్డింగ్ చేసే మిగతా ఆటగాళ్లు కూడా తమ స్థాయిని మరింత పెంచుకుంటారు. జట్టుపై అతడి ప్రభావం ఇప్పటికీ ఉంది' అని దిలీప్ వివరించాడు.2021 నవంబర్‌లో టీమిండియా సహాయక బృందంలో చేరిన దిలీప్.. ఇటీవలే ఫీల్డింగ్ కోచ్‌గా బాధ్యతల నుంచి తప్పుకున్నాడు. అతడి హయాంలో భారత్ 2024, 2026 టీ20 ప్రపంచకప్‌లతో పాటు 2025 ఛాంపియన్స్ ట్రోఫీ, 2023, 2025 ఆసియా కప్ టైటిళ్లు సాధించింది. 2023 వన్డే ప్రపంచకప్, ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో భారత్ రన్నరప్‌గా నిలిచింది. జింబాబ్వే పర్యటన అనంతరం దిలీప్ కాంట్రాక్ట్‌ను బీసీసీఐ పొడిగించలేదు. అతడి స్థానంలో భారత మాజీ క్రికెటర్ శుభదీప్ ఘోష్ ఫీల్డింగ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన సంగతి తెలిసిందే.


వెస్టిండీస్‌కు షాక్.. డైరెక్ట్ క్వాలిఫికేషన్ మిస్



ఒకప్పుడు ప్రపంచ క్రికెట్‌ను శాసించిన వెస్టిండీస్ జట్టుకు మరో ఎదురుదెబ్బ తగిలింది. వన్డే ప్రపంచ కప్ 2027కు నేరుగా అర్హత సాధించే అవకాశాన్ని ఆ జట్టు కోల్పోయింది. సెప్టెంబర్ 30 నాటికి ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో టాప్-8లో నిలిచే జట్లకు నేరుగా ప్రపంచ కప్ బెర్త్ దక్కనుంది. ఆతిథ్య దేశాలు దక్షిణాఫ్రికా, జింబాబ్వేతో కలిపి మొత్తం 10 జట్లు నేరుగా అర్హత సాధించనున్నాయి. తాజాగా ఐర్లాండ్‌తో జరిగిన ఉత్కంఠభరిత పోరులో అఫ్గానిస్థాన్ విజయం సాధించిన సంగతి తెలిసిందే. దీంతో ఆ జట్టు టాప్-8లోకి దూసుకొచ్చింది. ఆస్ట్రేలియా, భారత్, న్యూజిలాండ్, పాకిస్థాన్, శ్రీలంక, ఇంగ్లండ్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్‌తో పాటు ఆతిథ్య జట్లు దక్షిణాఫ్రికా, జింబాబ్వే వన్డే ప్రపంచ కప్‌నకు నేరుగా అర్హత సాధించాయి. వెస్టిండీస్ ఇంకా భారత్‌తో రెండు వన్డేలు ఆడాల్సి ఉంది. వాటిలో రెండింటినీ గెలిచినా.. అఫ్గానిస్థాన్‌ను వెనక్కి నెట్టి టాప్-10లోకి వచ్చే అవకాశం లేదు.వన్డే ప్రపంచ కప్ 2027లో చోటు దక్కించుకోవడం కోసం వెస్టిండీస్ జట్టు.. ఐసీసీ వరల్డ్ కప్ క్వాలిఫయర్ టోర్నీలో ఆడాల్సి ఉంటుంది. ఇందులో ఐర్లాండ్‌తో పాటు క్రికెట్ వరల్డ్ కప్ లీగ్-2లో మెరుగైన ప్రదర్శన చేసిన జట్లు, క్వాలిఫయర్ ప్లే ఆఫ్స్ నుంచి వచ్చిన జట్లు పాల్గొంటాయి. క్వాలిఫయర్‌లో విజేతగా నిలిస్తే వెస్టిండీస్ నేరుగా ప్రపంచ కప్‌కు అర్హత సాధిస్తుంది. ఒకవేళ రెండు, మూడు లేదా నాలుగో స్థానాల్లో నిలిస్తే 'సూపర్ సిరీస్' ప్లే ఆఫ్‌లో ఆడే అవకాశం ఉంటుంది. ఆ దశలో విజేతగా నిలిచిన జట్టుకు ప్రపంచ కప్‌లో మిగిలిన చివరి బెర్త్ దక్కుతుంది.2023 ప్రపంచ కప్‌కు కూడా వెస్టిండీస్ నేరుగా అర్హత సాధించలేక క్వాలిఫయర్స్‌కు వెళ్లింది. అయితే అక్కడా విఫలమై తొలిసారి ప్రపంచ కప్‌కు దూరమైంది. అనంతరం ఛాంపియన్స్ ట్రోఫీకి కూడా అర్హత సాధించలేకపోయింది. ఇప్పుడు 2027 ప్రపంచ కప్ బెర్త్ కోసం మరోసారి క్వాలిఫయర్ మార్గాన్నే నమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నా హక్కుల కోసం పోరాడాను.. అదే నేను చేసిన తప్పు: హర్భజన్ సింగ్

టీమిండియా మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ తన కెరీర్ తొలినాళ్లలో ఎదురైన ఓ చేదు అనుభవాన్ని గుర్తు చేసుకున్నాడు. 2000లో బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీ(ఎన్‌సీఏ) నుంచి తనను బయటకు పంపడానికి దారితీసిన ఘటనపై తాజాగా స్పందించాడు. ఎన్‌సీఏలో శిక్షణ పొందిన తొలి బ్యాచ్ ఆటగాళ్లలో హర్భజన్ కూడా ఉన్నాడు.



బీసీసీఐలో తమ మాటకు ఎదురు చెప్పేవారిని సహించలేని కొందరు ఉండేవారని భజ్జీ ఆరోపించాడు. డైట్ చార్ట్‌ను అనుగుణంగా ఆహారం అందించకపోవడంతో ప్రశ్నించానని.. అందుకే తనను ఎన్‌సీఏ నుంచి పంపించేశారని వెల్లడించాడు. 1998లో అంతర్జాతీయ క్రికెట్ అరంగేట్రం చేసిన భజ్జీ.. అతడి కెరీర్‌లో 600 వికెట్లు తీశాడు. 2016లో క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాడు. తాజాగా భజ్జీ ఓ ఇంటర్వ్యూలో నాటి రోజుల గురించి మాట్లాడాడు.'అప్పట్లో ఎన్‌సీఏలో ఆటగాళ్ల కోసం ప్రత్యేక డైట్ చార్ట్ ఏర్పాటు చేశారు. అయితే అందుకు అనుగుణంగా ఆహారం అందించేవారు కాదు. అక్కడి ఆహారం కూడా సరిగ్గా ఉండేది కాదు. డైట్ చార్ట్ ప్రకారం భోజనం పెట్టాలని పలుమార్లు ఫిర్యాదు చేసినా పరిస్థితుల్లో మార్పు రాలేదు. దీంతో ఒకరోజు బాగా కోపమొచ్చింది. వెంటనే వెళ్లి ఆ డైట్ చార్ట్ చించేశా. నేను చేసిన ఏకైక తప్పు అదే. దీంతో నన్ను ఎన్‌సీఏ నుంచి బయటకు పంపించేశారు. నేను నా హక్కుల కోసం పోరాడా. నేను ప్రశ్నించకపోతే ఇప్పటికీ అదే డైట్ చార్ట్ ఉండేది. అదే ప్లాన్ కొనసాగేది. నేను ప్రశ్నించినందుకే నాపై చర్యలు తీసుకున్నారు. డైట్ ప్లాన్ మాత్రం మారింది. నన్ను బయటకు పంపడం వేరే విషయం. కానీ ఇందులో నా తప్పేమీ కాదు. ప్రశ్నించడం నా హక్కు. నా హక్కుల కోసం నేను పోరాడాను' అని హర్భజన్ స్పష్టం చేశాడు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వం లక్ష్యం

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి ఆగస్టు 11 తెలంగాణ పవర్ : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గ పరిధిలోని పినపాక, మణుగూరు మండలాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంపై ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక దృష్టి సారించారు.

మంగళవారం మణుగూరు మండలంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఉదయం పినపాక మండలానికి, మధ్యాహ్నం మణుగూరు మండలానికి చెందిన ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఆయా మండలాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతి, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరుతున్నాయా లేదా అనే అంశాలపై గ్రామాల వారీగా సమీక్షించారు.

సమావేశంలో సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, ఎంపీటీసీలు, మండల స్థాయి ప్రజాప్రతినిధులు, పార్టీ మండల అధ్యక్షులు, మండల నాయకులు, ముఖ్య కార్యకర్తలు, గ్రామస్థాయి నాయకులు పాల్గొని తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.

గ్రామాల వారీగా సమస్యలపై ఆరా

ప్రతి పంచాయతీలో ప్రధానంగా ఉన్న తాగునీటి సమస్య, అంతర్గత రహదారులు, డ్రైనేజీలు, సీసీ రోడ్లు, వీధి దీపాలు, పారిశుధ్యం, విద్యుత్ సమస్యలు, సాగునీటి వసతులు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ భవనాలు, రేషన్, పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు తదితర అంశాలపై ఎమ్మెల్యే ప్రజాప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామాల్లో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, పంచాయతీ భవనాలు, కమ్యూనిటీ హాళ్లు, పాఠశాలలు, ఇతర మౌలిక వసతుల పనుల ప్రస్తుత పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు.

సంక్షేమ పథకాలు అర్హులకు చేరాలి

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల విషయంలో అర్హులైన ఒక్క కుటుంబం కూడా మిగిలిపోకుండా ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు, రైతు సంక్షేమం, పెన్షన్లు, రేషన్, మహిళా సంక్షేమ పథకాలు, విద్య, వైద్యం తదితర ప్రభుత్వ పథకాల అమలులో గ్రామస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలపై పూర్తి అవగాహన కల్పించడంతో పాటు, అర్హత ఉన్నప్పటికీ పథకాలు అందని వారి వివరాలను సేకరించి పరిష్కారానికి కృషి చేయాలని ప్రజాప్రతినిధులకు సూచించారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం

గ్రామాల్లో మంజూరైన అభివృద్ధి పనులను కేవలం ప్రారంభించడం కాకుండా పనులు వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే అన్నారు. జరుగుతున్న పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడకూడదని, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామాల్లో అత్యవసరంగా పరిష్కరించాల్సిన సమస్యలను ప్రజాప్రతినిధులు గుర్తించి తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ప్రజాప్రతినిధులు--అధికారులు సమన్వయంతో పనిచేయాలి

ప్రజలకు ప్రభుత్వానికి మధ్య ప్రజాప్రతినిధులు కీలక వారధిగా వ్యవహరించాలని పాయం వెంకటేశ్వర్లు అన్నారు. సర్పంచులు, వార్డు సభ్యులు, ఎంపీటీసీలు, మండల నాయకులు, పార్టీ కార్యకర్తలు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను తెలుసుకోవాలని సూచించారు.

అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలులో ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే వాటిని వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని అన్నారు. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు సమన్వయంతో పనిచేస్తేనే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయగలమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పినపాక, మణుగూరు మండలాల్లోని ప్రతి గ్రామానికి సమాన ప్రాధాన్యతనిస్తూ మౌలిక వసతుల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల అమలుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. సమావేశంలో ఆయా మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మోదీపై వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

– ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు బీజేపీ డిమాండ్



వేములవాడ, ఆగస్ట్ 11: ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ డిమాండ్ చేశారు. మంగళవారం వేములవాడలోని అంబేద్కర్ విగ్రహానికి బీజేపీ నాయకులు వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ఆది శ్రీనివాస్ రాజ్యాంగ విలువలను విస్మరించి మాట్లాడటం సరికాదన్నారు. ప్రధాని మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేయడం శోచనీయమన్నారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో బీజేపీకి చెందిన ఎనిమిది మంది ఎమ్మెల్యేలు స్పీకర్‌కు ఫిర్యాదు చేయనున్నారని తెలిపారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు తీసుకువస్తున్నారని పేర్కొన్నారు. మోదీ, బండి సంజయ్‌పై విమర్శలు చేస్తే మంత్రి పదవి వస్తుందనే ఆశతో ఆది శ్రీనివాస్ మాట్లాడుతున్నారని ఆరోపించారు. వేములవాడ పట్టణ అభివృద్ధికి ఎన్ని నిధులు తీసుకొచ్చారో ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు.

మోదీ, బండి సంజయ్‌పై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని శ్రీధర్ హెచ్చరించారు.

కార్యక్రమంలో కౌన్సిలర్ ముత్యంనాయకులు, గడ్డమీద శీను, కటకం శ్రీనివాస్, వాసం మల్లేశం, బిల్లా కృష్ణ, జవ్వాజి శేఖర్, నామాల శేఖర్, నేరెళ్ల సాయికిరణ్, వావిలాల నరసయ్య, నాంపల్లి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి:

పాఠశాలల్లో నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి -

గ్రామీణ క్లినిక్‌లలో మెరుగైన వైద్య సేవలు అందించాలి - కలెక్టర్ అంకిత్



భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి ఆగస్టు 11 తెలంగాణ పవర్ : విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించేలా చూడాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. విద్యార్థులు, చిన్నారులు, గ్రామీణ ప్రజలకు విద్య, పౌష్టికాహారం, వసతి, వైద్య సేవలందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. మంగళవారం పాల్వంచ మండలంలోని కిన్నెరసాని గిరిజన సంక్షేమ ఆదర్శ క్రీడా పాఠశాల, యానంబైలు జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాల, యానంబైలు గ్రామీణ క్లినిక్, రాజాపురం అంగన్వాడీ కేంద్రాల్లో కలెక్టర్ అంకిత్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.

తనిఖీల్లో కీలక అంశాలు:

కిన్నెరసాని క్రీడా పాఠశాలలో: తరగతి గదులు, హాస్టళ్లు, వంటగది, లైబ్రరీ, క్రీడా మైదానాలను పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి హాస్టల్ సౌకర్యాలు, తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుధ్యం, ఆహారం, విద్యా సామగ్రి గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల్లోని క్రీడా ప్రతిభను గుర్తించి మెరుగైన శిక్షణ, అవసరమైన క్రీడా పరికరాలు అందించాలని, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దాలని ఆదేశించారు.

యానంబైలు ప్రాథమిక పాఠశాలలో:

మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులతో మాట్లాడి ఆహార నాణ్యత, రుచి, మెనూ గురించి ఆరా తీశారు. నిర్దేశించిన మెనూ పాటించకపోవడాన్ని గుర్తించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ మెనూను కచ్చితంగా పాటిస్తూ ప్రతిరోజూ నాణ్యమైన, రుచికరమైన, పౌష్టికాహారాన్ని అందించాలని, నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యానంబైలు గ్రామీణ క్లినిక్‌లో:

గ్రామస్తులకు అందుతున్న వైద్య సేవలు, రక్త పరీక్ష సౌకర్యాలు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. మందుల నిల్వలు, లభ్యత, పంపిణీ రికార్డులు, గడువు తేదీలను తనిఖీ చేశారు. గడువు తీరిన మందులు వాడకుండా చూడాలని, అత్యవసర మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని, రోగులు, పరీక్షలు, మందుల పంపిణీ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.

రాజాపురం అంగన్వాడీ కేంద్రంలో:

చిన్నారుల హాజరు, పౌష్టికాహారం, గుడ్ల పంపిణీ, మెనూ గురించి ఆరా తీశారు. తనిఖీ సమయంలో చిన్నారులు నిద్రిస్తుండటంతో వారికి ఇబ్బంది కలగకుండా సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. పిల్లల కోసం తయారు చేసిన ఆహారాన్ని స్వయంగా పరిశీలించి నాణ్యత, పరిశుభ్రతను చెక్ చేశారు. అర్హులైన ప్రతి చిన్నారికి పౌష్టికాహారం అందేలా చూడాలని ఆదేశించారు.


ప్రజా సేవల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, తమ పరిధిలోని సంస్థలను అధికారులు తరచూ సందర్శించి లోపాలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో తహసీల్దార్లు ధారా ప్రసాద్, ప్రసాద్ తో పాటు వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, క్రీడా కోచ్‌లు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

చలో కలెక్టరేట్' ను విజయవంతం చేయండి : బీడీ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మోత్కూరి సుధీర్ కుమార్ పిలుపు

కరీంనగర్, ఆగస్టు 11: ఆగస్టు 17న భారతీయ మజ్దూర్ సంఘ్ (బి.ఎం.ఎస్.) చేపడుతున్న 'చలో కలెక్టరేట్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీడీ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మోత్కూరి సుధీర్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం కరీంనగర్ లోని బి.ఎం.ఎస్. కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై అనంతరం మాట్లాడుతూ... జార్ఖండ్ రాష్ట్ర రాజధాని రాంచీలో జూలై 26, 27, 28 తేదీలలో జరిగిన బి.ఎం.ఎస్. కేంద్ర కార్యకారిణి సమావేశంలో దేశవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై విస్తృతంగా చర్చించారని, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న కార్మిక వర్గ న్యాయమైన డిమాండ్ల సాధనకై 2026 ఆగస్టు 17న దేశవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో భారీ నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించామని తెలిపారు.

ఈ పోరాటం కేవలం ఏ ఒక్క రంగానికో పరిమితం కాదని, అసంఘటిత రంగ కార్మికులు, బీడీ కార్మికులు, బ్యాంకులు, ఎల్.ఐ.సి., ఇ.పి.ఎస్.-95 పింఛనుదారులు, పథక కార్మికులు (అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకం, ఆశా సిబ్బంది), భవన నిర్మాణ కార్మికులు, ప్లాట్‌ఫార్మ్ కార్మికులు, రవాణా కార్మికుల హక్కుల సాధన కోసం జరుగుతున్న చారిత్రాత్మక పోరాటమని మోత్కూరి సుధీర్ కుమార్ పేర్కొన్నారు.

ఇ.యస్.ఐ.సి. అర్హత వేతన పరిమితిని రూ. 21,000 నుండి రూ. 42,000 కు



పెంచి కార్మికులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, ఇ.పి.ఎఫ్. కనీస పెన్షన్‌ను రూ. 1,000 నుండి రూ. 7,500 కు పెంచి దానికి కరువు భత్యం (డి.ఎ.) అనుసంధానించాలని, ఉచిత ఇ.యస్.ఐ. / ఆయుష్మాన్ భారత్ వైద్య సౌకర్యం కల్పించాలని, ఇ.పి.ఎఫ్. వేతన పరిమితిని రూ. 15,000 నుండి రూ. 30,000 కు పెంచాలని, కనీస వేతనం రూ. 30,000 లకు పెంచాలని డిమాండ్ చేశారు. ఒప్పంద, బాహ్య నిర్వహణ ఉద్యోగులకు సర్వోన్నత న్యాయస్థానం (సుప్రీంకోర్టు) తీర్పు ప్రకారం సమాన వేతనం వర్తింపజేయాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పపుల సురేష్, జిల్లా అధ్యక్షులు పసుల శ్రవణ్, కార్యదర్శి తొర్తి శ్రీనివాస్, గోంటి సురేందర్, రేణిగుంట శంకర్, ఆవదుర్తి రవి, ప్రసాద్ మధుకర్, మురళి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్‌కు బీఆర్ఎస్ యువ నాయకుల సన్మానం..



మెట్‌పల్లి, ఆగస్టు 11(తెలంగాణ పవర్) : మెట్‌పల్లి పట్టణంలో శ్రీ మహాలక్ష్మి అమ్మవారి వన భోజనాలు, బోనాల ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించడంతో పాటు పట్టణంలో శానిటేషన్, పరిసరాల పరిశుభ్రతకు ప్రత్యేక శ్రద్ధ వహించి సమర్థవంతంగా విధులు నిర్వహించిన మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్‌ను బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ యువ నాయకులు మొరపు తేజ, కొండ్లేపు శ్యామ్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ శ్రీనివాస్ గౌడ్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

అనంతరం వారు మాట్లాడుతూ.. అమ్మవారి ఉత్సవాల సందర్భంగా పట్టణానికి విచ్చేసిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శానిటేషన్ సిబ్బందితో నిరంతరం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కమిషనర్ చేసిన కృషి అభినందనీయమన్నారు. ఉత్సవాల సమయంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో మున్సిపల్ యంత్రాంగం సమర్థవంతంగా పనిచేసిందని కొనియాడారు.

మెట్‌పల్లి పట్టణ అభివృద్ధితో పాటు ప్రజల సౌకర్యార్థం మున్సిపల్ యంత్రాంగం అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని వారు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పిజిఎస్ఏఐ జిల్లా అధ్యక్షుడిగా బిల్లా శ్రీకాంత్



వరంగల్, బ్యూరో ; ప్రియాంకా గాంధీ నంఘటన్ ఆల్ ఇండియా (పిజిఎన్ఏఐ) వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా వరంగల్ నగరంలోని 37వ డివిజన్ ఖిలా వరంగల్ తూర్పు కోటకు చెందిన సీనియర్ నాయకులు బిల్లా శ్రీకాంత్ నియామకం అయ్యారు. ఈ మేరకు ప్రియాంకా గాంధీ సంఘటన్ ఆల్ ఇండియా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు అరుముల్ల యమునా రెడ్డి ఆదివారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ నందర్భంగా బిల్లా శ్రీకాంత్ మాట్లాడుతూ నా పై నమ్మకంతో పిజిఎస్ఏఐ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా నియమించడంతో మరింత బాధ్యత పెరిగిందని, శక్తివంచన లేకుండా వరంగల్ జిల్లాలో ప్రియాంకా గాంధీ సంఘటన్ ఆల్ ఇండియా అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. నాకు ఈ పదవి రావడానికి సహకరించిన ప్రియాంకా గాంధీ సంఘటన్ ఆల్ ఇండియా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు అరుముల్ల యమునా రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందెల్లి ప్రకాష్, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, పోలీస్ వెంకన్న, పిజిఎస్ఏఐ వరంగల్ ఉమ్మడి జిల్లా ఇంచార్జ్ మేదరబోయిన రమేష్, రాష్ట్ర, జిల్లా నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రేషన్ డీలర్ ను తొలగించాలని తహసీల్దార్ కు వినతి

జహీరాబాద్ ఆగష్టు 11: జహీరాబాద్ మండలం కొత్తూరు-బి గ్రామానికి సంబందించిన రేషన్ డీలర్ ను తొలగించాలని గ్రామస్తులు కోరారు. మంగళవారం తహసీల్దార్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు. సరుకులు సక్రమంగా ఇవ్వడం లేదని, దురుసుగా వ్యవహరిస్తున్నాడని మండిపడ్డారు. రెండో రేషన్ డీలర్ దుకాణం ఏర్పాటు చేయాలని కోరారు. గత 40సంవత్సరాల నుండి ఒకే వ్యక్తి రేషన్ డీలర్ గా కొనసాగడం జర్గుతుందన్నారు. రేషన్ కోసం వచ్చే వారిపట్ల పాపయ్య కుటుంబ సభ్యులు దురుసుగా మాట్లాడుతూ వారికీ అనుకూల సమయంలో రేషన్ ఇవ్వడంతో ప్రజలకు తీవరమైన ఇబంధులు కల్గిస్తున్నారు. డీలర్ మాట తీరు తో ప్రజలు మానసిక వేదనకు గురైతునారని, డీలర్ ను తొలగించి వేరే వారిని నియమించాలని అలాగే రెండో రేషన్ దుకాణశీ ఏర్పాటు చేయాలనీ అలిగి సందీప్ కుమార్ (అడ్వకేట్) , అగస్టీన్, డేవిడ్, బాలరాజ్ పాల్గినారు




సినిమా

నవంబర్ 6న రామాయణ విడుదల



నితీశ్ తివారీ దర్శకత్వంలో భారీ స్థాయిలో తెరకెక్కుతోన్న చిత్రం 'రామాయణ'ను ప్రకటించినప్పుడే రెండు భాగాల విడుదల ఎప్పుడనేది చిత్రబృందం వెల్లడించింది. ఈ ఏడాది దీపావళి కానుకగా.. మొదటి భాగాన్ని, వచ్చే ఏడాది దీపావళికి రెండో పార్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు మేకర్స్ తెలిపారు. తాజాగా మొదటి భాగం అధికారిక విడుదల తేదీని చిత్ర నిర్మాణ సంస్థ ప్రకటించింది. నవంబర్ 6న రామాయణను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు తెలుపుతూ పోస్ట్ పెట్టింది అదే రోజున రణ్‌బీర్ కుమార్తె రాహా పుట్టినరోజు కావడంతో ఈ తేదీ ఆయనకు మరింత ప్రత్యేకం కానుంది. ఇక ఈసినిమాలో మండోదరి పాత్రలో కాజల్ కనిపించనున్నారు. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో ఈ చిత్రం గురించి మాట్లాడారు. ఇది ఎంతో గొప్పగా రూపొందుతోందని.. ప్రపంచదేశాలకు మన సంస్కృతిని తెలియజేయడానికి రామాయణ సరైన కథ అని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందే కథలను సృష్టించగల సామర్థ్యం భారతీయ సినిమాకు ఉందని చెప్పారు. రూ.4000కోట్లతో ఈ సినిమా రూపొందుతోంది. ఇందులో రాముడిగా రణ్‌బీర్ నటించగా.. సీతగా



సాయిపల్లవి, రావణుడి పాత్రలో యశ్ కనిపించనున్నారు. ఇటీవల ట్రైలర్‌ను విడుదల చేయగా అది విజువల్ వండర్‌గా యూట్యూబ్ ట్రెండింగ్‌లో నిలిచింది.

చకచకా రాకా మూవీ షూటింగ్

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె ప్రస్తుతం మాతృత్వాన్ని ఆస్వాదిస్తూ కుటుంబంతో సమయం గడుపుతున్నారు. అయితే ఆమె మెటర్నటీ బ్రేక్ కారణంగా అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'రాకా' షూటింగ్‌కు ఆటంకం ఏర్పడుతుందనే ప్రచారం జరుగుతున్న వేళ, చిత్రబృందం అందుకు పూర్తి భిన్నంగా ముందుకు సాగుతున్నట్లు సమాచారం. సినీ వర్గాల సమాచారం ప్రకారం, దీపికా మెటర్నటీ బ్రేక్‌ను ముందుగానే దృష్టిలో పెట్టుకుని చిత్రబృందం షూటింగ్ షెడ్యూల్‌ను ఎంతో కచ్చితంగా ఎ÷-లాన్ చేసింది. ఆమె అందుబాటులో ఉన్న సమయంలోనే ఎక్కువ భాగం సన్నివేశాలను పూర్తి చేయడంతో ప్రస్తుతం షూటింగ్ ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగుతోంది. దీపికా విరామంలో ఉన్న రోజుల్లో ఇతర ప్రధాన నటీనటులతో చిత్రీకరణ నిర్వహిస్తూ ఒక్క రోజు కూడా వృథా కాకుండా మేకర్స్ జాగ్రత్తలు తీసుకున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం దీపికా పదుకొణెకు సంబంధించిన షూటింగ్ దాదాపు పూర్తయినట్లు సమాచారం. చిన్న సన్నివేశాలు మాత్రమే ఉండగా, వాటిని తర్వాతి దశలో చిత్రీకరించే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఆమె వ్యక్తిగత జీవితానికి, సినిమా నిర్మాణానికి మధ్య ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మేకర్స్ పక్కా ప్లానింగ్ చేసినట్లు తెలుస్తోంది. 'రాకా' సినిమాలో దీపికా పదుకొణె పాత్ర కథకు అత్యంత కీలకమని సమాచారం. ఆమె పాత్ర చుట్టూనే కథలో ప్రధాన మలుపులు తిరుగుతాయని టాక్ వినిపిస్తోంది. అందుకే షూటింగ్ ప్రారంభ దశలోనే ఆమె సన్నివేశాలకు ప్రాధాన్యం ఇచ్చి పూర్తి చేసినట్లు తెలుస్తోంది.భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో 'రాకా' ఒకటిగా నిలిచింది. భారీ తారాగణం, హై టెక్నికల్ స్టాండర్డ్స్, భారీ బ్జడెట్‌తో రూపొందుతున్న ఈ సినిమాపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. షూటింగ్ అనుకున్న షెడ్యూల్ ప్రకారమే కొనసాగుతుండటంతో, సినిమా విడుదల కూడా నిర్ణయించిన సమయానికే జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.



తండ్రి నాగబాబుతో వరుణ్ తేజ్ బరి



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ నటించిన తాజా చిత్రం 'కొరియన్ కనకరాజు' ఆగస్టు 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదలకు ముందు చిత్రబృందం జోరుగా ప్రమోషన్స్ నిర్వహిస్తుండగా, తాజాగా ఓ ఇంటర్వ్యూలో వరుణ్ తేజ్ తన తదుపరి సినిమా గురించి ఆసక్తికర విషయాన్ని వెల్లడించారు. తొలిసారిగా తన తండ్రి నాగబాబుతో కలిసి ఒకే సినిమాలో నటించబోతున్నట్లు ప్రకటించారు. నాగబాబు నటుడిగా చిరంజీవి, పవన్ కళ్యాణ్, రామ్ చరణ్, సాయిధరమ్ తేజ్ సహా మెగా కుటుంబానికి చెందిన పలువురు హీరోలతో కలిసి నటించారు. అయితే ఆశ్చర్యకరంగా తన కుమారుడు వరుణ్ తేజ్‌తో మాత్రం ఇప్పటివరకు పూర్తి స్థాయి సినిమాలో స్క్రీన్ షేర్ చేసుకోలేదు. గతంలో 'హ్యాండ్స్ అప్' సినిమాలో వరుణ్ తేజ్ చిన్ననాటి పాత్రలో కనిపించినప్పటికీ, తండ్రీకొడుకుల మధ్య ఒక్క కాంబినేషన్ సీన్ కూడా లేదు.ఇప్పుడు ఆ లోటును 'బరి' సినిమా భర్తీ చేయనుంది. ఈ చిత్రంలో వరుణ్ తేజ్, నాగబాబు కలిసి నటించడమే కాకుండా, ఇద్దరి మధ్య కీలకమైన కాంబినేషన్ సీన్లు కూడా ఉంటాయని వరుణ్ వెల్లడించారు. తండ్రితో కలిసి నటించడం తనకు ఎంతో ప్రత్యేకమైన అనుభూతిగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఇక 'బరి' చిత్రాన్ని నాగబాబు కుమార్తె నిహారిక కొణిదెల నిర్మిస్తున్నారు. 'కమిటీ కుర్రాళ్లు' సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు యదు వంశీ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందనున్న ఈ సినిమాపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి.





కింగ్ జాకీ క్వీన్..మూవీపై ఆసక్తికర అంశం

ఈ శుక్రవారం విడుదల కానున్న తెలుగు చిత్రాల్లో 'కింగ్ జాకీ క్వీన్ ' ఒకటి. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్, ప్రచార చిత్రాలతో ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించిన ఈ పీరియాడిక్ క్రైమ్ డ్రామాపై సినీ వర్గాల్లో మంచి అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రానికి మరో ప్రత్యేకత ఏమిటంటే.. ప్రముఖ దర్శకుడు కిరణ్ కుమార్ చివరిసారిగా దర్శకత్వం వహించిన సినిమా ఇదే కావడం. దీక్షిత్ శెట్టి, శశి ఓదెల, యుక్తి తరేజా ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై నిర్మాత సుధాకర్ చెరుకూరి నిర్మించారు. ఈ నేపథ్యంలో తాజాగా జరిగిన ప్రమోషనల్ కార్యక్రమంలో దర్శకుడు సందీప్ రెడ్డి వంగా వెల్లడించిన ఆసక్తికర విషయం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ.. దర్శకుడు కిరణ్ కుమార్ ఈ కథను దాదాపు 12 ఏళ్ల క్రితమే సిద్ధం చేశారని వెల్లడించారు. అప్పట్లో ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో తెరకెక్కించాలని భావించిన కిరణ్ కుమార్, కథానాయిక పాత్ర కోసం స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టిని దృష్టిలో పెట్టుకుని స్క్రిప్ట్ రూపొందించారట. అయితే వివిధ కారణాలతో ఆ ప్రాజెక్ట్ అప్పట్లో సెట్స్‌పైకి వెళ్లలేదు. దీంతో సినిమా నిలిచిపోయినా, దర్శకుడు మాత్రం కథను వదిలిపెట్టకుండా కాలానికి అనుగుణంగా మార్పులు చేస్తూ మరింత బలోపేతం చేశారని తెలిపారు. మొదట అనుష్క కోసం రాసిన పాత్ర, కాలక్రమేణా మార్పులు చెంది ఇప్పుడు నటి యుక్తి తరేజా పోషిస్తున్న పాత్రగా రూపుదిద్దుకుందని సమాచారం. దీంతో ఎన్నో ఏళ్లుగా దర్శకుడు మనసులో ఉన్న కథ చివరకు 'కింగ్ జాకీ క్వీన్' రూపంలో ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సినిమాతో మరో ఆసక్తికర అంశం కూడా ఉంది. ప్రముఖ దర్శకుడు శ్రీకాంత్ ఓదెల సోదరుడు శశి ఓదెల ఈ చిత్రంతో హీరోగా సినీ రంగంలోకి అడుగుపెడుతున్నారు. తొలి చిత్రంతోనే పీరియాడిక్ క్రైమ్ డ్రామా వంటి విభిన్న కథను ఎంచుకోవడం ఆసక్తికరంగా మారింది.



Edited, Printed, Published and Owned by NASREEN KHAN , Printed at M/s DATTASAI GRAPHICS :1-1-651/8, Gandhi Nagar, Hyderabad-500 080
Published from H.No.1-7-137, Flat 402, Vijaysai Apartments, Zamistanpur, Musheerabad, Hyderabad- 20, (Telangana) Editor:Nasreen Khan, Ph : 040-27602786, Cell : 965243981 .R.N.I.No.TELTEL/2013/51844